
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 25.11.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 25 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## వికటిస్తున్న...
# ఆ'పరేషాన్'





- భారత ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడంలో విఫలం
- సున్నితంగా ముగించాల్సిన అంశాన్ని వివాదం చేశారు
- సాఫీగా సాగిపోతున్న తరుణంలో విపక్షాల చేతికి ఆయుధం

*ఒక హృద్రోగికి మూడు గుండె నరాలు బ్లాక్ అయ్యాయి. అర్జంట్‌గా ఆపరేషన్నైతే చేయాలి. ఎంత అర్జంట్‌గా చేయాల్సి వచ్చినా దానికి తగిన వైద్య పరికరాలు, సెలైన్‌లు, మందులు, కుట్లువేసే దారం, రక్తం యూనిట్లు, స్టంట్లు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలి. మత్తు డాక్టర్ మత్తు ఇచ్చాక గుండె డాక్టర్ శస్త్ర చికిత్స మొదలు పెట్టాలి. ఒక గుండె ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించాల్సిన ప్రక్రియ ఇది. అంతేగాని, హృద్రోగికి అర్జంట్‌గా ఆపరేషన్ చేయాలని చెప్పి ఇవేమీ లేకుండానే చేతిలో కత్తెర ఉంది కదా అని ముందుగా కోస్తే... ఆ తర్వాత వీటన్నింటిని వెదుక్కుని ఏరుకునే లోపు పేషంట్ పరిస్థితి ఏంటి? పేషంట్ బ్రతుకుతాడనే గ్యారంటీ ఉందా?*

నల్లధనం విషయంలో ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఆపరేషన్ ఈ తరహాలోనే ఉంది. ఆయన ఆపరేషన్ వికటిస్తున్నట్లుగా కనిపిస్తోంది. దేశంలో నల్లధనాన్ని అరికట్టడానికి, తీవ్రవాదులకు ఆర్థికంగా ఊతమిస్తున్న నకిలీ కరెన్సీని నిలువరించడానికి ఆయన చేయాలనుకున్న ప్రయత్నాన్ని ఎవరూ తప్పుపట్టలేదు. అయితే ఆ ఆపరేషన్ అమలు చేసిన విధానంలో లోపాల వల్లే సామాన్య ప్రజలు సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి తెచ్చింది.

### దేశ ఆర్థిక వ్యవస్థపై అంచనా లేక...

బ్లాక్ మనీ ఆపరేషన్‌లో ప్రధాన లోపం ఇందులో పాల్గొన్న వ్యూహకర్తలకు భారత ఆర్థిక వ్యవస్థపై సరైన అవగాహన, అంచనా లేకపోవడమేననిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ భారతాన్ని అంచనా వేయలేక పోయారు. దేశంలో (మిగతా 11వ పేజీలో)



● నెల్లూరులో మంత్రి బంపర్ ఆఫర్

## బ్లాక్ టు వైట్

**నల్లకుబేరులకు బంపర్ ఆఫర్... పెద్దనోట్లు రద్దు చేసారని చింత వద్దు... మీ మంత్రిగా నేనున్నాను... మీ నల్లడబ్బు భద్రత నా బాధ్యత... మీ వద్ద వున్న నల్లడబ్బునంతా తెచ్చివ్వండి... ఇచ్చిన డబ్బుకు రశీదు తీసుకోండి... మూడు నెలల వరకు వడ్డీ ఇవ్వను. ఆ తర్వాత రూపాయి వడ్డీ, రెండేళ్ల తర్వాత ఇచ్చిన డబ్బు రిటర్న్ చేస్తాం...**

నెల్లూరుజిల్లాలోని నల్ల ధనవంతులకు ఈ జిల్లాకే చెందిన మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఇచ్చిన బంపర్ ఆఫర్ ఇది. ఈ బంపర్ ఆఫర్‌కు నల్ల ధనవంతులు బాగానే స్పందించారు. దాదాపు వంద కోట్లకు పైనే పాతనోట్ల నగదును నారాయణ సంస్థల్లో అప్పగించారు. వీరిలో ఎక్కువమంది నెల్లూరు, గూడూరు, కావలి, కందుకూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులే ఉండడం విశేషం.

ఎన్నో ఏళ్లుగా నారాయణకు వ్యాపారులకు మధ్య ఒక నమ్మకమైన వడ్డీ వ్యాపారం జరుగుతోంది. వడ్డీ క్రింద ఇచ్చిన అప్పులను నారాయణ తన వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకుంటుంటాడు. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో తెచ్చిన అప్పుల మీద వడ్డీలు చెల్లించడం లేదా (మిగతా 11వ పేజీలో)



## మూగబోయిన 'మురళీ'రవం

### ప్రఖ్యాత సంగీతజ్ఞుడు బాలమురళీకృష్ణ అస్తమయం

(వివరాలు 12వ పేజీలో)



పెద్దనోటు క్లెయిమ్ నుండి

## బాబు ఔట్!

**ఏదైనా ప్రజలకు మంచి జరిగినప్పుడు అది నా వల్లే జరిగిందని ప్రచారం చేసుకోవడం, చెడు జరిగితే నాకు సంబంధం లేదని చెప్పుకోవడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య! హైదరాబాద్ హైటెక్ సిటీ వద్ద నుండి సింధు సాధించిన ఒలింపిక్ రజత పతకం వరకు అన్నీ కూడా ఆయన తన ఘనతలుగానే చెప్పుకుంటుంటాడు.**

ఈ కోవలోనే పెద్దనోట్ల రద్దు క్రెడిట్‌ను కూడా తన ఖాతాలో వేసుకోవాలనుకున్నాడు. ప్రధాని నోట పెద్దనోట్ల రద్దు నిర్ణయం వెలువడక ముందే వెయ్యి నోటును రద్దు చేయాలంటూ ప్రధానికి చంద్రబాబు లేఖ వ్రాసాడు. చంద్రబాబు వ్రాసిన లేఖ మూలంగానే నరేంద్ర మోడీకి జ్ఞానోదయమై పెద్దనోట్లను రద్దు చేసారంటూ తెలుగుదేశం నాయకులు మొదటి రెండు, మూడురోజులు ప్రచారం చేశారు. పెద్దనోట్ల రద్దు ఖ్యాతి దక్కితే ప్రజలు మోడీకే కాకుండా చంద్రబాబుకు కూడా జై కొడతారని భావించారు.

పెద్దనోట్ల రద్దు తర్వాత మొదటి రెండురోజులు బాగానే ఉండింది. ఆ తర్వాత సెగ మొదలైంది. ప్రజలకు సమస్యలు తీవ్రమయ్యాయి. వ్యాపారాలు దెబ్బతినసాగాయి. కూలీ నాలి చేసుకునే వారికి పనులు (మిగతా 10వ పేజీలో)



# కళాత్మకతను చాటిన ముగ్గుల పోటీలు




సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20వతేదీన నెల్లూరు రంగనాయకులపేట చిత్రకూటంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుండి మహిళలు పాల్గొని వివిధ రకాల ఆకృతులతో తీర్చిదిద్దిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సోమాజయ, మయూరి సుధ, ఎస్.విజయలక్ష్మిలు బహుమతులు అందుకున్నారు. పాల్గొన్న అందరికి చిరుకానుకలను అందజేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజినల్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఛైర్మెన్ ఎస్.వి.రమేష్‌బాబు, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి ప్రమీల, సామ్రాట్ క్లినిక్ అధినేత డా॥ మారం సుధాకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గోమేధికం భారతి, కృష్ణవేణిరెడ్డి వ్యవహరించారు. సృజన అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక శివనామార్చన



నెల్లూరులోని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఈ నెల 21వ తేదీ నెల్లూరు సుబేదారుపేటలో కార్తీక సోమవారం సందర్భంగా శివనామార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిల్లలు, మహిళలు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భజన బృందం సభ్యులు శివునిపై భక్తిగీతాలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు.

## ఎస్‌బిఐ
# డిప్యూటీ మేనేజర్ మృతి

నెల్లూరు బార కాసు సెంటర్‌లో వున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానశాఖ కార్యాలయంలో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్న షరీఫ్ గుండె పోటుకు గురై మృతి చెందారు. 19వ తేదీ శనివారం సాయంత్రం ఆయన విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయన ఛాంబర్లో గుండెనొప్పితో కుప్పకూలి పోయారు. ఈ హఠాత్ పరిణామంతో సహచర సిబ్బంది ఆయన్ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించారు. కొన్నిరోజులుగా సెలవు లేకుండా పని చేయడం, పెరిగిన పని ఒత్తిడితోనే మృతి చెందాడని ఆయన కుటుంబసభ్యులు బోరున విలపించారు. షరీఫ్ మృతితో ఇటు బ్యాంకులోని ఉద్యోగ సిబ్బంది, మూలాపేటలో నివాసముంటున్న ప్రాంతంలో విషాద ఛాయలు అలముకొన్నాయి. కాగా, మంగళవారం మూలాపేటలోని షరీఫ్ ఇంటికి పీసీసీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి వెళ్లి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సింహపురి సమాచారం

## సక్షమ్ ఆధ్వర్యంలో
# సెలిబ్రల్ పాల్సీ చిన్నారులకు ఉచిత చికిత్సలు

సక్షమ్, జయభారత్ హాస్పిటల్, రెడ్‌క్రాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సెలిబ్రల్ పాల్సి, స్పాస్టిక్స్(బాల పక్షవాతం) వున్న పిల్లల కోసం ఈ నెల 25వ తేది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ముంబై డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో జరిగే ఈ వైద్యశిబిరంలో ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రవైద్య నిపుణులు డాక్టర్ గరల్ నగడా (ముంబై) ఆధ్వర్యంలో డాక్టర్ జయదేవ్ దమేలీ, డాక్టర్ మొహ్మద్ హర్షద్, డాక్టర్ రఘురామయ్యల సహకారంతో సెరిబ్రల్ పాల్సీ, పుట్టుకతో నడక రాని పిల్లలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. తల్లితండ్రులు తమ పిల్లలను ఈ శిబిరానికి తీసుకువచ్చేటప్పుడు వికలాంగ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పుట్టిన తేది ధృవీకరణ పత్రంతో పాటు రెండు ఫోటోలు కూడా తీసుకురావాలని, స్క్రీనింగ్ తర్వాత ఆపరేషన్ అవసరమైనవారికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

# 4న ఘంటసాల జయంతోత్సవం

మధురగాయకుడు ఘంటసాల 94వ జయంతోత్సవం డిసెంబర్ 4వ తేదిన నెల్లూరులోని టౌన్‌హాలులో ఘనంగా నిర్వహిస్తామని ఘంటసాల అభిమాని, నిర్వాహకులు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం ప్రముఖ గాయకుడు, 2012 పాడుతా తీయగా విజేత, ప్రవీణ్‌కుమార్, ప్రముఖ గాయకుడు ఆకుతోట రమణయ్యల ఆధ్వర్యంలో సింహపురి గాయనీ గాయకులతో సుమధుర సంగీత గీతాలాపన, ప్రముఖ నాసికా వేణుగాన కళాకారుడు సాయిహేమంత్ వేణు గానాలాపన వుంటాయన్నారు. ఇదే సందర్భంలో, సింహపురి పట్టణంలో మధురగాయకుడు ఘంటసాల కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించిన ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ఆత్మీయ సన్మానం నిర్వహిస్తామన్నారు. ఘంటసాల అభిమానులు, సంగీతప్రియులంతా ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ పథకం

మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం పెన్షన్ పథకాన్ని ఏర్పాటు చేసిందని ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ తెలిపారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల వృత్తిలో ఉండి మరణించిన వారి వారసులు ప్రభుత్వం అందించే పథకాలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు మరణ ధృవీకరణ పత్రం, వారసత్వ ధృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ నకలు, అక్రిడిటేషన్, ఆధార్, రేషన్‌కార్డుల జెరాక్స్ కాపీలు దరఖాస్తుతో పాటు జతచేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టుల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 9440275013 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జ్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి


డ్వామా పి.డి హరిత

ఉపాధి హామీ కింద పని చేసిన వారికి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించినట్లు డ్వామా పి.డి హరిత తెలిపారు. ఈనెల 19వ తేదీ నెల్లూరు దర్గామిట్టలోని డ్వామా కార్యాలయంలో విలేకర్లతో ఆమె మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దు ఉపాధిహామీ కూలీలపై పడిందన్నారు. చెల్లింపులు ఆగిపోయి కూలీలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి పోస్టాఫీసులకు డబ్బులు పంపే ఏర్పాట్లు చేశారన్నారు. మొత్తం రూ. 9కోట్లు బిల్లులు పెండింగ్ ఉండగా ఉపాధి కూలీలకు చెల్లించేందుకు బ్యాంక్ నుంచి పోస్టాఫీసుకు శుక్రవారం ఒక్కరోజే రూ.5కోట్లు పంపిం చామన్నారు. చిల్లర సమస్యలు లేకుండా రూ.100, రూ.50 నోట్లను పంపుతున్నట్లు తెలిపారు. బ్యాంక్ ఖాతాలు లేని కూలీలు త్వరలో ఖాతాలు ఓపెన్ చేయించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# జిఎస్‌టిలో దాఖలు చేయాల్సిన రిటర్నులు ఇవే

**జిఎస్‌టిపై పరిశీలన-7**

(గత వారం తరువాయి)


చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్
e-mail:
chinnisravankumar@gmail.com

(ఏ) సేవలను వినియోగించుకున్న సమయం.. లేదా
(బి) సేవలకు పన్ను చెల్లించిన తారీఖు.. లేదా
(సి) బిల్లు తీసుకున్న తారీఖు...లేదా
(డి) అకౌంటు పుస్తకాల్లో నగదు చెల్లించాలని నమోదు చేసిన తారీఖు.

**సరఫరా జరిగిన ప్రదేశం :** జిఎస్‌టి చట్టంలో సెక్షన్ 5 (2) ప్రకారం సరఫరా ప్రకారం వస్తువులకు స్థాన చలనం కలిగితే ఏ ప్రదేశంలో వస్తువులు అందజేస్తామో ఆ ప్రదేశాన్ని సరఫరా చేసే ప్రదేశంగా పరిగణిస్తారు.

**ఉదా :** ఎం.వి సతీష్ ఆంధ్రరాష్ట్రంలోని వ్యాపారికి ముంబైకి చెందిన వ్యాపారికి వ్యాపారానుసారం వస్తువును ఆర్డర్ చేస్తూ ఆ వస్తువును తన గోడౌన్‌లో ఇవ్వాలని సూచించడం జరిగింది. అయితే, వస్తువును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అందజేస్తాడు కనుక సరఫరా జరిగిన ప్రదేశాన్ని ఆంధ్రప్రదేశ్‌గానే పరిగణిస్తారు.

జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 5 (3) ప్రకారం వస్తువులను స్థానచలనం లేకుండా సరఫరా జరిపితే ఆ వస్తువును ఎక్కడైతే అందజేయబడుతుందో ఆ ప్రదేశాన్ని సరఫరా ప్రదేశంగా పరిగణిస్తారు.

**ఉదా :** ఢిల్లీ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన వ్యాపారి సతీష్ దగ్గర వస్తువులు కొనుక్కుని తనతో ఢిల్లీకి తీసుకునిపోతే సరఫరా జరిగిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవుతుంది.

జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 2 (4) ప్రకారం వస్తువులను ఏ స్థలంలో అయితే సమీకరించబడ్డాయో దానినే సరఫరా చేసిన స్థలంగా పేర్కొనబడడం జరిగింది. జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 5 (5) ప్రకారం ఏ వస్తు సరఫరా అయినా వాహనాల ద్వారా పంపాల్సివస్తే ఆ వస్తువును ఎక్కడైతే వాహనాలలోకి చేరుస్తారో ఆ ప్రదేశాన్ని సరఫరా జరిగిన ప్రదేశంగా గుర్తిస్తారు.

పన్ను పరిధిలోని వ్యక్తి సూచించిన సమయానికి సంబంధించిన వ్యాపార వివరాలను సూచించిన నివేదిక ద్వారా సమర్పించే పత్రాన్నే రిటర్న్ అంటారు.

జిఎస్‌టి అనేది స్వీయ అంచనాపై వేసే వినిమయ పన్ను వ్యవస్థ. జిఎస్‌టి పోర్టల్‌లో ఐజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి కొరకు ఉమ్మడి రిటర్ను దాఖలు చేయాల్సివస్తుంది. అధికారులు వారికి సంబంధించిన విషయాలను స్వీకరించి వాటిని విశ్లేషించడం జరుగుతుంది.

రిజిస్టర్ కాబడిన పన్ను పరిధిలోని ప్రతి వ్యక్తి సూచించిన పన్నుల సమయానికి రిటర్న్ దాఖలు చేయాల్సివుంటుంది. ఒకవేళ పన్ను సమయాల్లో ఎటువంటి వ్యాపారం జరుగకపోయినా రిటర్ను దాఖలు చేయాల్సి వస్తుంది.

స్వీయ అంచనా ద్వారా పన్ను కట్టకుండా దాఖలు చేసిన రిటర్ను చెల్లుబాటు కాదు.

సాధారణ పన్ను పరిధిలోని వ్యక్తి బయట జరిపే సరఫరాలకు సంబంధించి జిఎస్‌టి-1 దాఖలు చేయాలి. దీనిలో ప్రతి లావాదేవీకి సంబంధించిన వివరాలు పొందుపరచబడతాయి. జిఎస్‌టి-2 ద్వారా బయట జరిగే సరఫరాలను దాఖలు చేయడం జరుగుతుంది. కనుక, సరఫరాదారుడు తెచ్చుకునే సరఫరాలకు సంబంధించి జిఎస్‌టి-2 దానంతట అదే పూర్తి చేసుకోవడం జరుగుతుంది.

జిఎస్‌టి-1, 2 దాఖలు చేసిన తర్వాత పన్ను చెల్లించి నెలకోసారి జిఎస్‌టి-3 దాఖలు చేయాల్సివుంటుంది. అంటే, నెలకు మూడు రిటర్నులు దాఖలు చేయాలి. వీటన్నింటిని కలుపుకుని సంవత్సరాంతానికి జిఎస్‌టి-8 దాఖలు చేయాల్సివుంటుంది.

అంటే, సాధారణ పన్ను పరిధిలోని వ్యక్తి సంవత్సరానికి 37 రిటర్నులు దాఖలు చేయాల్సివుంటుంది.

బయట సరఫరాలకు లేదా రాష్ట్రంలోనే జరిగే సరఫరాలకు సంబంధించి మార్పులను చేయడానికి ఒక టేబుల్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ టేబుల్ ద్వారా క్రెడిట్ మరియు డెబిట్ నోట్‌లు పొందుపరచడానికి వీలుంటుంది.

ప్రతి రిటర్నులో ఒక టేబుల్ ఏర్పాటు చేయడం ప్రత్యేకత. ఆ టేబుల్ ద్వారా తప్పులను సరిచేయడానికి, మరియు మార్పులను పొందుపరచడానికి వీలు కల్పించడం మరో ప్రత్యేకత.

స్వీయ అంచనా వేసుకుని పన్ను ఎంత కట్టాలో నిర్ణయించుకోవాల్సివుంటుంది.

అంచనాను (అసెస్‌మెంట్) పరిస్థితులకు అనుగుణంగా ఈ క్రింది విధంగా విభజించడం జరిగింది.

1. స్వీయ అంచనా. 2. సమ్మరి అంచనా 3. తాత్కాలిక అంచనా 4. రెగ్యులర్ అంచనా 5. ప్రొటెక్టివ్ అసెస్‌మెంట్ 6. బెస్ట్ జడ్జిమెంట్ అంచనా

అసెస్‌మెంట్ జరిగిన తర్వాత విధానాలకు సంబంధించి లేక పన్నులకు సంబంధించి ఎటువంటి తగాదాలు, వివాదాలు వచ్చినా అప్పీలుకు వెళ్ళే వెసులుబాటు కల్పించబడింది.

అప్పీలుకు సంబంధించి నాలుగు విధాలైన అప్పీలు ఏర్పాటుచేయడం ఒక వెసులుబాటు.

1. ప్రథమ అప్పీలు విభాగము 2. అప్పీలు ట్రిబ్యునల్ 3. హైకోర్టు 4. సుప్రీంకోర్టు

న్యాయ నిర్ణయ అధికారి ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా లేదని భావించినప్పుడు మొదట అప్పీలు విభాగంలో దాఖలు చేసుకొనడం జరుగుతుంది. సదరు అధికారి ఇచ్చిన ఆజ్ఞాపత్రానికై 3 నెలల్లో అప్పీలు దాఖలు చేయాల్సివుంటుంది. ఆఫీసర్ ఆర్డర్‌పై ఇలా అప్పీళ్లు జరుగుతాయి.

***'లాయర్' పాఠకులకు జిఎస్‌టిపై అవగాహన కల్పించడం కోసం చేసిన మా ఈ చిన్ని ప్రయత్నాన్ని ఆదరించినందుకు కృతజ్ఞతలు.*** (సమాప్తం)

# సంగీత ప్రపంచానికి వరం.. బాలు స్వరం!

## ఎస్పీ బాలుకు సెంటినరీ అవార్డు ప్రదానం



**దాదాపు అయిదు దశాబ్దాలుగా అద్భుతమైన తన గాన మాధుర్యంతో అందరినీ ఓలలాడిస్తున్న గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు.**

గోవాలో ఈ నెల 20న ప్రారంభమైన 47వ భారతీయ అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ)లో బాలూ ఎంతో విశిష్టమైన శతవసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారం (సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్-2016) అందుకుని అందరి ప్రశంసలందుకున్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆయన ఈ ఘనమైన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బాలూ మాట్లాడుతూ, ఈ గౌరవ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా వుందన్నారు. 'ఈ పురస్కారాన్ని నా మాతృమూర్తికి, దేశం కోసం సరిహద్దుల్లో పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన సైనిక సోదరులకు అంకితమిస్తున్నాన'ని ఆయన అన్నారు. ఈ యాభై ఏళ్లు ఎలా గడిచిపోయాయో తెలియలేదు. ఇప్పటికీ పాడుతూనే వున్నాను. ఈ గొప్ప జీవితాన్నిచ్చిన నా తల్లిదండ్రులకు, గాయకుడిగా తనకు మరో జన్మనిచ్చిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు కోదండపాణికి కృతజ్ఞతలని ఆయన వినమ్రంగా అన్నారు. అంతేకాదు, తనతో కలిసి పనిచేసిన సంగీత దర్శకులకు, గీత రచయితలకు, సహచర గాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 'నా పాటకు తెరపై ప్రాణం పోసిన నటులకు, ఇప్పటికీ నన్ను, నా పాటను మరచిపోని శ్రోతలకు రుణపడి వున్నా'నన్నారు. ఈ అయిదు దశాబ్దాలుగా మీరంతా నా వెన్నంటివుండి నా జీవితాన్ని పరిపూర్ణం చేశారన్నారు. తనను ఎంతో గౌరవించిన 'ఇఫీ' నిర్వాహకులకు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడికి బాలూ తన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఆ తర్వాత ఓ హిందీ పాటను పాడి అందరినీ తన గానామృతంలో పరవశించేట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యానాయుడుతో పాటు, చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ముఖేష్ ఖన్నా తదితర ప్రముఖులెందరో పాల్గొన్నారు. కాగా, బాలూకి ఇంత గొప్ప అవార్డు రావడం ప్రతి భారతీయునికి గర్వకారణమని, ప్రత్యేకించి సింహపురి సీమ ప్రజలకు ఎంతో సంతోషకరమని ఇక్కడి సంగీత సాహిత్యాభిమానులు, కళాకారులు ఎంతగానో ఆనందించారు.



# నెల్లూరీయుల గుండెల్లో నిలిచారు

## డాక్టర్ రాజుకు కోటంరెడ్డి అభినందన

గుండె వ్యాధుల చికిత్సా రంగంలో 20వేల ఆపరేషన్లు, 2లక్షల30వేల మంది ఔట్‌పేషంట్లకు వైద్య చికిత్సలు పూర్తి చేసుకున్న 'కిమ్స్' ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజును నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సత్కరించారు. సోమవారం నెల్లూరు శ్రీహరినగర్‌లోని డాక్టర్ ఇంటికి వెళ్లి కోటంరెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. నెల్లూరీయులకు మీ వైద్యమే గుండెంత ధైర్యమని, ఎంతోమంది ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్న మీరు నెల్లూరీయుల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డితో పాటు వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు, పచ్చా రవి, జల్లి బుల్లి, డిష్ రమేష్, ప్రసాదరావు, రవిచంద్ర, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్‌ను సత్కరించారు.

# ప్రతిభ చాటిన రత్నం



ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రతిభతో 'మాన్ ఇన్ జీనియస్ హోం' నమూనాను తయారు చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నెల్లూరు, సరస్వతీనగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థిని పి.భవానిని జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం అభినందించారు. ఈనెల 26 నుండి 28 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు భవానీ నమూనా ఎంపికైంది. మంగళవారం డిఇఓ తన కార్యాలయంలో భవానిని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా విజేతగా నిలవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జి.ఎం రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ఏ.ఓ రుక్మిణి, సుప్రియ, సుధ, సుస్మిత పాల్గొన్నారు.

## నిరసనలు, ఆందోళనలకు

# అనుమతి అవసరం

### - ఎస్పీ విశాల్‌గున్నీ



విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు తమకు ఇష్టం వచ్చిన రీతిలో నిరసనలు, ఆందోళనలు, సమావేశాలు నిర్వహించరాదని, పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతి అవసరమని నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు నిరసనలు, సమావేశాలు నిర్వహించాలంటే స్థానిక డిఎస్పీల వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి తీసుకోని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# పక్షుల పండక్కి ముహూర్తం ఖరారు



సంక్రాంతి, దసరా, క్రిస్మస్, రంజాన్ వంటి పండుగలే కాకుండా నెల్లూరుజిల్లా వాసులకు ప్రతి ఏటా అదనంగా ఇంకో పండుగ ఉంటుంది. అదే సూళ్లూరుపేట కేంద్రంగా జరిగే పక్షుల పండుగ! ఈ ఏడాది పెద్దనోట్ల పండుగ, పక్షుల పండుగ ఒకే తేదీతో ముగిసేలాగా ముహూర్తం నిర్ణయించారు. ఈ రెండు పండుగలతో 2016 సంవత్సరం ముగియనుండడం విశేషం. పెద్దనోట్ల పండుగ ముగింపుకు డిసెంబర్ 30వ తేదీ ఆఖరుగా ఆల్‌రెడీ ప్రధాని మోడీ ముహూర్తం పెట్టేసి వున్నారు. కాగా, జిల్లాలో పక్షుల పండుగను కూడా అదే తేదీతో ముగిస్తారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు దీనికి ముహూర్తం పెట్టారు. డిసెంబర్ 28, 29, 30వ తేదీలలో పక్షుల పండుగను నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు కలెక్టర్ 22వ తేదీ పండుగ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పక్షుల పండుగ చేసుకోమని రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలు మంజూరు చేసిందని కలెక్టర్ వెల్లడించారు. పక్షుల పండుగ సందర్భంగా సూళ్లూరుపేట జడ్పీ హైస్కూల్ మైదానంతో పాటు బి.వి.పాలెం, నేలపట్టు, అటకానితిప్ప తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అతిథి గృహాలను మరమ్మత్తులు చేసి సిద్ధంగా వుంచాలని, పర్యాటకులకు సమస్యలు రాకుండా రవాణా, పోలీస్, మున్సిపాల్టీ వంటి శాఖలన్నీ తమ పరిధుల్లో పనులు చేయాలని సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, జేసి-2 రాజ్‌కుమార్, జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి భవితకు ఉపాధ్యాయుడే దీపిక




వైజ్ఞానిక ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

ప్రతి విద్యార్థి భవితకు ఉపాధ్యాయుడే ముఖ్యభూమిక అనీ, విద్యార్థి ఎలాంటి ఉన్నతస్థాయికి చేరాలన్నా ఉపాధ్యాయుడే మార్గదర్శకమైన వెలుగుల దీపిక అనీ ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ రక్షణశాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19న నెల్లూరు సుబేదారుపేటలో వున్న సెయింట్ జాన్స్ ఆంగ్ల ఉన్నతపాఠశాలలో జిల్లా 6వ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2016ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఆలోచించే తత్వాన్ని అలవరచుకోవాలని, చిన్న కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్‌కలాం ఎన్నో అద్భుత విజయాలు సాధించారని, ఆ స్ఫూర్తితో విద్యార్థులంతా భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, ఈ నెల 21వ తేదీతో ఈ సైన్స్‌ఫేర్ ముగిసింది. ముగింపు సభకు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విచ్చేసి విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ప్రస్తుతం కార్పొరేట్ శక్తులు విద్యా వ్యవస్థను బలహీనం చేస్తున్నాయని, వీటిని అడ్డుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, డిఇఓ రామలింగం, జిల్లా సైన్స్‌ఫేర్ అధికారి రాధారాణి పాల్గొన్నారు.

## రైలు ప్రమాద మృతులకు

# సూక్ష్మ ఎక్స్‌ప్రెస్ ద్వారా నివాళులు





నెల్లూరు జెండావీధికి చెందిన సూక్ష్మ స్వర్ణకారుడు డా॥ షేక్ మునవ్వీర్ ఉత్తర ప్రదేశ్ రైలు దుర్ఘటనలో మృతిచెందిన వారికి సూక్ష్మ రైలు ద్వారా మంగళవారం తన సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మునవ్వీర్ మాట్లాడుతూ ఆదివారం తెల్లవారు జామున ఇండోర్ నుంచి పాట్నా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ పుఖ్రాయన్ వద్ద 14బోగీలు పట్టాలు తప్పి దాదాపు 146మంది మృతి చెందారని, 200మందికిపైగా గాయపడ్డారని, వీరికి సానుభూతిగా 5గ్రాముల వెండితో ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ సూక్ష్మ నమూనాను తయారు చేసినట్లు తెలిపారు. దీనిని తయారు చేయడానికి రెండురోజుల సమయం పట్టిందని, దీని ఎత్తు 2సెం.మీ.లు, వెడల్పు 10సెం.మీ.లని తెలిపారు. ఇంతమంది చనిపోవడం దురదృష్టకరమని, గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# 'ప్రభా'తం

వారి జీవిత ప్రయాణం అనుకోకుండానే ఆగిపోయింది.. గమ్యం చేరకుండానే ముగిసిపోయింది. అనేకమందిని నిద్రలోనే కబళించి మృత్యురాకాసి తన కర్కశత్వాన్ని చాటుకుంది. ఏమి జరిగిందో తెలుసుకునేలోగానే జరగకూడని దారుణమంతా జరిగిపోయింది.

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఘోర రైలు ప్రమాదం బాధిత కుటుంబాలను శోకసముద్రంలో ముంచివేసింది. దేశప్రజలకు తీరని వేదన కలిగించింది. ఇండోర్ నుంచి పట్నాకు వెళ్తున్న ఇండోర్-పట్నా ఎక్స్‌ప్రెస్ రైలు మార్గమధ్యంలో కాన్పూర్‌కు సుమారు నూరు కిలోమీటర్ల దూరంలోని దేహత్‌జిల్లా పుఖ్రయా వద్ద ఘోరప్రమాదానికి గురైంది. దాదాపు 146 మంది ప్రాణాలు బలితీసుకున్న ఈ ప్రమాదం భారతీయ రైలు ప్రమాదాల చరిత్రలో మరో పెనువిషాదంగా నమోదైంది. అంతేకాదు, మరో 200 మందికి పైగానే ప్రయాణీకులు గాయాల పాలయ్యారు. రైలు పట్టాలు తప్పడంతో 14 బోగీలు పట్టాలు పట్టుతప్పి బోల్తా కొట్టాయి. వీటిలో కొన్ని బోగీలు తునాతునకలయ్యాయి. మరికొన్ని నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో చనిపోయినవారు చనిపోగా, చేతులు విరిగి కాళ్ళు తెగి.. అనేకమంది గాయాలతో విలవిలలాడారు. మృత్యువుకు గురైన వారి మృతదేహాలు నెత్తుటి చారికలతో చెల్లాచెదరుగా పడిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణీకులంతా గాఢనిద్రలో వున్నారు. చిమ్మ చీకటిలో.. వేకువన 3గంటల ప్రాంతంలో జరిగిన ఈ దుర్ఘటనతో ప్రయాణీకుల హాహాకారాలు.. ఆర్త నాదాలు మిన్నుముట్టాయి. కలదెలుసుకునేసరికి ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దుర్ఘటనలో దాదాపు 146 మంది ప్రయాణీకులు మృతిచెందడం అత్యంత బాధాకరం. తెల్లవారేసరికి వారి జీవితాలు తెల్లవారిపోవడం విషాదకరం. పట్టా విరగడం వల్లనే ఈ ప్రమాదం సంభవించి వుంటుందని భావిస్తున్నా, కుట్ర కోణం లోనూ ఉన్నతాధికార యంత్రాంగం దర్యాప్తు చేపట్టింది. ఈ దుర్ఘటనకు అసలు కారణాలేమిటో దర్యాప్తులో నిర్ధారణ కావాల్సివుంది. ఈ దారుణానికి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వేమంత్రి సురేశ్‌ప్రభు ఎంతో గట్టిగా చెప్పారు. ఆ దృఢత్వం ఏళ్లతరబడిగా లేనందువల్లే రైల్వేకి ఈ దురవస్థ దాపురించిందేమో!.. ఇప్పుడే కాదు, దేశంలో ఎన్నో ఏళ్ళుగా రైళ్ళ పట్టాలు ఎంతోమంది ప్రాణాలను బలిగొంటూనే వున్నాయి. గతంలోనూ అనేక ఘోరమైన రైలు ప్రమాదాలు జరిగాయి. ఒక్క ఉత్తరప్రదేశ్ విషయానికి వచ్చినా ఆ రాష్ట్రంలో ఇదేమీ మొదటిది కాదు. 1988లో కర్నాటక ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 75 మంది మృతిచెందారు. 1995లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్‌లో కాళిందీ ఎక్స్‌ప్రెస్‌ను, మరో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో నాలుగువందల మందిదాకా మరణించారు. 1996లో కూడా ఉత్తరప్రదేశ్‌లోని డోనేంగడ్ వద్ద ఆగివున్న గూడ్స్‌ను ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో 60 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా జరిగిన ఈ ప్రమాదం గత ఐదేళ్ళలో అతిపెద్ద రైలు ప్రమాదం కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా రైల్వే భద్రతకు రైల్వేశాఖ నిరంతరం అనేక కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూ వుండడమే దురదృష్టకరం. ఎంతగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా, తీసుకోవాల్సిన చర్యలు ఇంకా బోలెడన్ని మిగిలే వుంటున్నా యనేందుకు ఈ ప్రమాదమే ఒక తాజా ఉదాహరణ. మన భద్రతా వ్యవస్థలో లోపాల వల్లనే ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతూనే వున్నాయని, ప్రయాణీకుల భద్రత గాలిలో దీపంలాగే వుంటోందని ప్రయాణీకుల ఆవేదన. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనాల తర్వాత భారత్‌దే అతిపెద్ద రైల్వే వ్యవస్థ. అయితే, ప్రయాణ భద్రతలో మనం ఇంకా ఎంతో వెనుకబడే వున్నాం. అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చినా, ఆ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రమాదాలు నివారించడంలో మన రైల్వేవ్యవస్థ ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతోంది. దాదాపు 160 ఏళ్లకు పైగా చరిత్ర వున్న మన రైల్వేవ్యవస్థ ఇప్పటికీ భద్రతా పరమైన లోపాలతోనే సతమతమవుతుండడం విచార కరం. రైలు పట్టాలను నవీకరించుకోవాలని, వ్యవస్థను ఆధునీకరించుకోవాలని ప్రయాణీకుల భద్రత, శ్రేయస్సే లక్ష్యంగా గతంలో నిపుణులు చేసిన సిఫారసులు ఎన్నో వున్నా అవన్నీ అటకెక్కిపోతున్నాయే తప్ప ఆచరణలోకి రాకపోవడాన్ని ఏమనుకోవాలి?.. భద్రతా వ్యవస్థను మెరుగుపరచేందుకు గతంలో అనిల్ కకోద్కర్, శ్యాంపిట్రోడా నేతృత్వంలో రెండు వేర్వేరు కమిటీలు నివేదికలు సమర్పించినా అవన్నీ బుట్టదాఖలే కావడం విచారకరం. ఈ నేపథ్యంలో, మనమెక్కిన రైలు మనల్ని గమ్యం చేరుస్తుందో.. లేదోననే భీతితో.. అభద్రతతో ప్రయాణం చేయాల్సిరావడం ఎంత దురదృష్టకరం. ఇకనైనా, రైల్వేవ్యవస్థ మరింత అప్రమత్తం కావాలి. ప్రయాణీకులను గమ్యం చేర్చే పట్టాలను ప్రాణప్రదంగా చూసుకునేందుకు తగిన యంత్రాంగాన్ని సమకూర్చుకోవాలి. అవసరమైన సిబ్బందిని తక్షణం నియమించుకోవాలి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు సంయుక్తంగా కలసి, రైల్వేవ్యవస్థను ఒక భద్రమైన వ్యవస్థగా పరిపుష్టం చేయాలి. పట్టాలపై తరచూ జరుగుతున్న అగ్నిప్రమాదాలు, బోగీలు తప్పి బోల్తా కొట్టడాలు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైళ్ళు ఢీకొట్టడాలు, రైళ్ళకు రైళ్ళే ఢీకొట్టుకోవడాలు వంటి అన్నిరకాల ప్రమాదాలను వెంటనే నివారించేందుకు కేంద్రం, రైల్వేశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

ఏదేమైనా..ప్రయాణం ప్రమాదంగా మారకూడదు. ప్రయాణీకుల గమ్యం..ఎప్పటికీ మృత్యుద్వారం కాకూడదు. రైలు పట్టాలు..ప్రాణాలు తీసే మృత్యువుకు రాస్తాలు కాకూడదు. అన్నిరకాల ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించినప్పుడే ప్రయాణీకుల భద్రతకు భరోసా వుంటుంది. ఆ దిశలో ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకున్నప్పుడే పట్టాలపై ప్రయాణం భద్రంగా సాగుతుంది.

## మరో పెను విషాదం



ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం.. ఒక పెను విషాదమే. దాదాపు146 మంది ప్రాణాలను బలిగొన్న ఈ ఘోరం ఎంతో దురదృష్టకరం. అయినా, ప్రయాణాలెప్పుడూ ప్రమాదంగా మారకూడదు. ప్రయాణీకుల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైల్వేశాఖ మరింత దీక్షతో పటిష్ట మైన చర్యలు తీసుకోవాలి. అన్నిరకాల ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించినప్పుడే ప్రయాణీకుల భద్రతకు భరోసా వుంటుంది. పటిష్టమైన భద్రతకు శక్తివంతమైన చర్యలు తీసుకున్నప్పుడే పట్టాలపై ప్రయాణం భద్రంగా వుంటుంది.

# అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం



నెల్లూరులోని వేదాయపాళెంలో కొలువై వున్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో జరుగుతున్న మండల పూజా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న స్వామి వారికి వైభవంగా క్షీరాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామివారికి ఉష:పూజా మహోత్సవం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం స్వామి వారికి శ్రీవేలి ఉత్సవం ఘనంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షులు పి.టి రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావు, ఉభయకర్తలు కావడి శ్రీనివాసరావు, ఝాన్సీ, అయ్యప్పన్ ఉత్తమ్, అయ్యప్పన్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ నుంచి నగదు రహిత రేషన్

డిసెంబర్ నుంచి జిల్లాలోని చౌకదుకాణాల్లో నగదు రహిత లావాదేవీలు జరుగుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల రేషన్‌కార్డుదారులందరూ వారి బ్యాంకు ఖాతా ఏ బ్యాంక్‌లో వుంటే ఆ బ్యాంక్‌లో వారి బ్యాంక్ అకౌంట్ నంబరును వారి ఆధార్‌కార్డుతో సీడింగ్ చేసుకోవాలన్నారు.

# ఏసీ స్టేడియంలో టెన్నికాయిట్ పోటీలు

## 13 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు హాజరు



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 19న 35వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్-2016 పోటీలు ఈ నెల 19న ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొని మాట్లాడుతూ, మొగళ్ళపాళెంలో 150 ఎకరాల్లో నిర్మితమవుతున్న క్రీడా గ్రామంతో నెల్లూరుకు ఎంతో క్రీడాభవిత వుంటుందని ఆకాంక్షించారు. నెల్లూరు భవిష్యత్తులో అంతర్జాతీయస్థాయి క్రీడా కేంద్రంగా గుర్తింపు పొందుతుందని, అందుకు కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ, టెన్నికాయిట్‌ను ప్రోత్సహించేందుకు నెల్లూరులో తొలిసారిగా రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహిస్తుండడం ఎంతో సంతోషదాయకమన్నారు. జిల్లాలో టెన్నికాయిట్ క్రీడ అభివృద్ధికి ప్రముఖ క్రీడాకారులు, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గాదం రమణయ్య, నరసయ్య చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట మనోహరం, ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ముస్తఫా ఆలీఖాన్, స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతినిధి జనార్ధన్‌రాజు, కార్పొరేటర్ మేకల రజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదం రమణయ్య, విశ్రాంత జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రవి సత్యనారాయణలను మేయర్ అబ్దుల్ అజీజ్ సన్మానించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 260 మంది క్రీడాకారులు హాజరయ్యారు.




## ఉపాధి ఉసురు తీసారు

భారత ఆర్థిక వ్యవస్థపై సరైన అవగాహన, అంచనా లేకుండానే ప్రధాని నరేంద్ర మోడీ పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లుగా వుంది. దేశంలో బ్లాక్‌మనీకి కొలమానం లేదు. లెక్కల్లో లేని డబ్బునంతా నల్లడబ్బు అని చెప్పలేరు. పొదుపు అన్నది భారతీయులకు శ్రీరామరక్ష లాంటిది. వచ్చిన సంపాదనలో కొంత సొమ్ము దాచి పెట్టుకునే సంస్కృతి భారత ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభం. ఈ దేశంలో స్వయం ఉపాధి ఎక్కువ. మోడీ నిర్ణయం ఇలాంటి ఉపాధి పొందుతున్న వారందరినీ దెబ్బతీసింది.

కె.శ్రీరాంరెడ్డి, బద్వేలు.

## చెలామణిలో ఉంటే సమస్య లేదు!

డిసెంబర్ 30వ తేదీ నుండి పెద్దనోట్లు రద్దు అని చెప్పారు. అలాంటప్పుడు డిసెంబర్ 20వ తేదీ దాకా పెద్దనోట్లను చెలామణిలో పెట్టి ఉంటే బ్యాంకుల ముందు క్యూలు కట్టాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ఒకవేళ ఆ ముసుగులో నల్లధనాన్ని మార్చుకుంటారన్న అనుమానం ఉంటే భారీ ఎత్తున బ్లాక్‌మనీ లావాదేవీలు జరిగే స్థిరాస్థి రిజిస్ట్రేషన్‌లు, బంగారం కొనుగోళ్లు, స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై నిషేధం పెట్టి ఉండొచ్చు. మిగతా అన్నింటిలో డిసెంబర్ 20 దాకా పెద్దనోట్లను చెలామణిలో పెట్టి వుంటే కేంద్రప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో ఇంత అసంతృప్తి వచ్చేది కాదు.

గంగినేని కృష్ణకుమార్, నెల్లూరు.

## దుబారా తగ్గించండి

ప్రస్తుతం దేశం ఆర్థిక సంక్షోభంలో వుంది. మన చంద్రబాబు మాత్రం ఖర్చు ఏ మాత్రం తగ్గించడం లేదు. అదే సింగపూర్ పిచ్చిలో ఉన్నాడు. పట్టిసీమ, పుష్కరాలు, రాజధాని, విమానాలు... పబ్లిసిటీ... అర్భాటపు పనులకే లక్ష కోట్లు దాకా తగలేసాడు. ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల్లో ఆ లక్ష కోట్లు రాష్ట్రంలో ఉంటే ఎన్నో మంచి పనులు చేసుకుని అభివృద్ధిని సాధించవచ్చు.

జి.వి.నగేష్, నెల్లూరు.

# కలెక్టర్‌కు బంగారు పతకం



జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా జాయింట్‌కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో రెడ్‌క్రాస్ ద్వారా ప్రజలకు చేసిన సేవలకుగాను ఈ పతకాన్ని అందుకోవడం జరిగింది.

# కార్పోరేషన్ పంట పండింది



పెద్దనోట్ల రద్దు సామాన్య ప్రజలను కష్టాలు, కోటీశ్వరులను నష్టాల పాల్జేసిన మాటేమోగాని నెల్లూరు నగర పాలక సంస్థ పాలిట మాత్రం వరంగా మారింది. పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో కార్పొరేషన్‌కు రావాల్సిన మొండి బకాయిలు చాలా వరకు వసూలయ్యాయి. నెల్లూరు నగర పాలక సంస్థకు ప్రతి ఏటా 70శాతం కూడా ఆస్థి పన్ను వసూలు కావడం లేదు. కార్పొరేషన్‌కు ఇదే పెద్ద ఆదాయ మార్గం. ఈ ఆదాయంతోనే కార్పొరేషన్ నడవాలి. ప్రతి ఏటా మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. ఆస్థి పన్నుల వసూలుకు కార్పొరేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తుంటారు. ఇటీవల అయితే మొండిబకాయిలు వున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి కార్పొరేషన్ సిబ్బంది దౌర్జన్యపూర్వక చర్యలకు దిగిన సందర్భాలు కూడా వున్నాయి. ఇలాంటి చర్యలపై ప్రజలు, ప్రతిపక్షాలు ఆగ్రహించాయి కూడా! కాని ఇప్పుడు అలాంటి చర్యలకు దిగే పని లేకుండా కార్పొరేషన్‌కు ఆస్థి పన్నులు, ఇతర పన్నులు వసూలవుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మూలంగా కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు వున్నవారంతా తమ వద్ద వున్న పాతనోట్లతో పన్నులు చెల్లించడంతో వీళ్లకు పాత నోట్ల సమస్య తీరింది. కార్పొరేషన్‌కు మొండిబకాయిలు వసూలైనట్లయ్యింది.

# సిటింగ్‌లకు కటింగ్?

## జిల్లాలో తెలుగుదేశం తరపున ఒక్కరు తప్ప అన్నీ కొత్త ముఖాలేనా?



***2019 అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోంది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వుంది. ప్రభుత్వ పాజిటివ్ ఓటుతో అభ్యర్థులను గెలిపించుకోవడం కష్టం. అదీగాక పెద్దనోట్ల రద్దు ప్రభావం కూడా వచ్చే ఎన్నికల మీద ఉండబోతోంది. ధనం వున్న అభ్యర్థులనే కాకుండా గుణగణాలున్న అభ్యర్థులను వెదకాలి. ఈ కోణంలో చూస్తే సిటింగ్‌లకు చాలావరకు కటింగేనని తెలుస్తోంది.***

జిల్లాలో మొత్తం 10అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గం నుండి తప్పితే మిగతా 9అసెంబ్లీల నుండి గత అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడ్డ వారికి టిక్కెట్లు ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. సర్వేపల్లిలో సోమిరెడ్డి గత ఎన్నికల్లో తక్కువ కాలంలో ఎలక్షన్‌కు రెడీ అయ్యి, అతితక్కువ మెజార్టీతో ఓడిపోవడం, ఎన్నికల తర్వాత నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడం వంటివాటి మూలంగా ఆయన అభ్యర్థిత్వానికి ఢోకాలేనట్లే కనిపిస్తోంది. నెల్లూరు నగరం సీటును క్రితం సారి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికిచ్చారు. ఈసారి మాత్రం ఆనం కుటుంబానికి చెందిన వారికి నగరం సీటు దక్కవచ్చని సమాచారం. 2014 ఎన్నికల్లో నెల్లూరు గ్రామీణాన్ని పొత్తులో భాగంగా బీజేపీకివ్వడం జరిగింది. కాని 2019 ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థిని ఖచ్చితంగా నిలుపుతారు. నారాయణను నెల్లూరు పార్లమెంట్‌కు లేదా నెల్లూరురూరల్‌కు దించొచ్చు. నారాయణ పార్లమెంటుకు పోటీ చేస్తే నెల్లూరురూరల్ నుండి ఆదాల ప్రభాకర్‌రెడ్డి(అప్పటికి పార్టీలో వుంటే) లేదా బీద రవిచంద్రలలో ఒకరిని పోటీకి దింపే అవకాశాలున్నాయి. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైన గూడూరు, సూళ్లూరుపేటల నుండి కూడా కొత్త ముఖాలే రంగంలో వుంటాయి. ఇక ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డికి టిక్కెట్ విషయంలో పోటీనే లేదు. తెలుగుదేశం సిటింగ్ స్థానాలైన ఉదయగిరి, వెంకటగిరి, కోవూరు నియోజకవర్గాల నుండి కూడా అభ్యర్థులు మారే అవకాశాలున్నాయి. సిటింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుందనే సమాచారమే ఇందుకు కారణం. కావలి నుండి బీద మస్తాన్‌రావు నిలబడడం సందేహమే! ఆయన రాజ్యసభ ప్రయత్నాల్లో ఉన్న నేపథ్యంలో తదుపరి ఎన్నికలకు ఇక్కడ కొత్త ముఖమే కనపడొచ్చు.

# గెలిపిస్తారా? గేలి చేస్తారా?

## గురువుకు సవాల్‌గా శిష్యుడి పోటీ





మంత్రి నారాయణ పట్టుబట్టి, సీఎం వద్ద వున్న చనువుకొద్ది మిగతా జిల్లాల నాయకులను సంప్రదించకుండానే తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని నియమించేసుకున్నారు. పట్టాభి పేరు ఎంతోకాలం నుండి ప్రచారంలో వుంది. ఇది మూడు జిల్లాల(ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు) నాయకుల సమిష్టి నిర్ణయంతో ముడిపడిన అంశం. పట్టాభిపేరు ప్రచారంలో ఉన్నా వీళ్లందరూ కూడా తమను సంప్రదించకుండా అభ్యర్థిని నిర్ణయించరులే అనే ధీమాతో ఉండిపోయారు. ముఖ్యనాయకులందరు కూడా తమకు సన్నిహితులను అభ్యర్థులుగా ప్రతిపాదించాలనే ఆలోచనతో ఉండినారు. తీరాచూస్తే వారి అభిప్రాయం, అవసరం లేకుండానే అభ్యర్థి నిర్ణయం జరిగిపోయింది. దీంతో మూడు జిల్లాల నాయకులు మంత్రి నారాయణపై ఉడికిపోతున్నారు. ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్న చందాన వ్యవహరిస్తున్న నారాయణ తీరు ఎవరికీ మింగుడు పడడం లేదు. ఇప్పుడు వారంతా కూడా మంత్రి ఏకపక్షంగా నిర్ణయించిన అభ్యర్థి పట్టాభి గెలుపుకోసం పని చేస్తారా? కేవలం నారాయణ విద్యాసంస్థలలో పనిచేసే ఉద్యోగుల ఓట్లతోనే పట్టాభి గెలవగలడా? ఈ మూడు జిల్లాల్లో నారాయణ విద్యాసంస్థలు ఎన్ని ఉన్నాయి. పట్టభద్రుల నియోజకవర్గంలో ఎంతమందికి ఓట్లున్నాయి. వీళ్లంతా కూడా పట్టాభికే ఓట్లు వేస్తారన్న గ్యారంటీ ఉందా? ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదు కూడా భారీగానే జరిగింది. అయితే వీళ్లంతా కూడా పట్టాభికే ఓట్లేస్తారన్న నమ్మకాలు లేవు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటింగ్ విషయంలో స్థానిక నాయకుల ప్రభావం ఎక్కువుగా ఉంటుంది. స్థానిక నాయకులంతా ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల నిర్ణయాలపై ఆధారపడి వుంటారు. పైకి ఎవరు కూడా పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా చేయమని చెప్పరు. కాని అంతర్గతంగా వ్యతిరేకంగా పనిచేయడం కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద సమస్య కాదు.

ఇక పట్టభద్రులకు సంబంధించిన ఓటింగ్‌లో యూటిఎఫ్‌దే పైచేయిగా వుంటుంది. ఈసారి వైసిపి, వామపక్ష విద్యార్థి, ఉపాధ్యాయ విభాగాలన్నీ యూటిఎఫ్‌కు సంఘీభావం తెలుపుతాయి. కాంగ్రెస్ సైతం ఇదే బాటను పట్టొచ్చు. పట్టభద్రుల నియోజకవర్గం నుండి యూటిఎఫ్ అభ్యర్థిగా బరిలో వున్న యండపల్లి శ్రీనివాసులురెడ్డి మీద వ్యతిరేకత లేదు. కాబట్టి వారిని తట్టుకుని పట్టాభి గెలవగలడా? గెలిస్తే మంత్రిగా నారాయణ తొలి సక్సెస్ ఇదే! గెలవకపోతే మాత్రం పార్టీలోని అసమ్మతి నాయకులే ఆయనను గేలిచేయడం ఖాయం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# వ్యాపారాలన్నీ బంద్

## • పెద్దనోట్ల రద్దుతో అస్తవ్యస్థం



వెలవెలబోతున్న ఎంజిబి మాల్

***పెద్దనోట్ల రద్దుతో చిల్లర దొరక్క సామాన్య ప్రజలే కాదు వ్యాపారాలన్నీ పడిపోయి వ్యాపారస్థులు విలవిలలాడుతున్నారు. పెద్దనోట్ల రద్దు ప్రకటన వెలువడ్డాక వ్యాపార లావాదేవీలు సగానికి సగం పడిపోయాయి. వెయ్యి, 500 నోట్లు రద్దు చేశారు. కొత్తగా 2వేల నోటు విడుదల చేశారు. మార్కెట్‌లో చిల్లర లేక ఇవి చెలామణి కావడం కష్టసాధ్యంగా మారింది. వంద, యాభై, 20, 10... చిన్ననోట్ల హవా పెరిగింది. మార్కెట్‌లో ఈ నగదు శాతం తక్కువ. చెలామణిలో ఎక్కువుగా ఉన్నది 500నోట్లే! కొత్తగా 500 నోటు విడుదల కావడం ఆలస్యమైంది. దీంతో వ్యాపారస్థులకు సినిమా కష్టాలు మొదలయ్యాయి.***

మొదటి దెబ్బ రియల్ ఎస్టేట్ మీద పడింది. అసలే అంతంతమాత్రంగా వున్న రియల్ మార్కెట్ పెద్ద నోట్ల రద్దుతో కుదేలయ్యింది. రియల్టర్లు డీలా పడిపోయారు. రియాల్టీ మీదనే వందల కోట్లలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వడ్డీ వ్యాపారులు ఖంగుతిన్నారు. కొందరు బాకీల వసూళ్లకు పరుగులు తీస్తుంటే, ఇంకొందరు లక్షలు, కోట్లలో తిరిగి వచ్చిన అప్పులను తెల్ల ధనంగా ఎలా మార్చుకోవాలో తెలియక తంటాలు పడుతున్నారు. ఇక రియల్ ఆధారంగా జరుగుతున్న వ్యాపారాలన్నీ కూడా తగ్గాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. స్టీలు, సిమెంట్ వ్యాపారాల్లోనూ ప్రతిష్టంభన నెలకొంది. వ్యాపారాలు లేక జిల్లాలో వేలాది లారీలు, ట్రక్కులు, ట్రాక్టర్లు ఆగిపోయాయి. ప్రజల వద్ద చిల్లర కొరతతో పాటు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టే పరిస్థితి లేకపోవడంతో మందుబాబులు మద్యం షాపులు, బార్లకు పోవడం తగ్గించేశారు. ఇంతకుముందు రోజూ హాఫ్ తాగేవాళ్లు ఇప్పుడు క్వార్టర్ లేదా రెండు పెగ్‌లతో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయలు, చిల్లర వర్తకంలోనూ జోరు తగ్గింది. నోట్ల రద్దు ప్రకటించిన పక్కరోజు బంగారు అమ్మకాలు జోరుగా సాగాయి. అయితే బంగారం అమ్మకాలపై పాన్‌కార్డు నిబంధనను పెట్టడంతో ఈ అమ్మకాలు కూడా పడిపోయాయి. చాలాచోట్ల బంగారం దుకాణాలను మూసేసారు.

ముఖ్యంగా లగ్జరీ వ్యాపారాలపై దీని ప్రభావం బలంగా వుంది. ఇంతకుముందు ఆయా ఆటోమొబైల్ షోరూమ్‌లలో లగ్జరీ కార్లు, చిన్న కార్లు, బైక్‌ల అమ్మకాలు తీవ్రస్థాయిలో ఉండినాయి. ముఖ్యంగా కొన్ని కంపెనీల కార్లు డెలివరీకైతే 10 నెలల దాకా గడువు పెడుతూ వచ్చారు. పెద్దనోట్ల రద్దు తర్వాత కార్లు, మోటార్ బైక్‌ల అమ్మకాలు బాగా తగ్గాయి. చేతిలో వున్న చిల్లరను జాగ్రత్తగా ఉంచుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రజలు సినిమాలు, షాపింగ్‌లకు పోవడం లేదు. బట్టల కొనుగోళ్లు కూడా తగ్గాయి. రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టుల వ్యాపారం కూడా సగానికి పడిపోయింది. ఆయా వ్యాపార సంస్థలైతే ఈ నెల వ్యాపారాలు లేక తమ సిబ్బందికి జీతాలు ఎలా ఇవ్వాలో తెలియని పరిస్థితుల్లో వున్నాయి. ముఖ్యంగా జీతాలు ఇవ్వడానికి కొత్త నోట్లు లేవు. పాత నోట్ల రూపంలో జీతాలు ఇవ్వలేరు. రైతులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. పైర్ల సీజన్ కావడంతో ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ సంబంధిత కొనుగోళ్లు ఉంటాయి. వీటి కొనుగోలుకు పాతనోట్లు తీసుకోవడం లేదు, రైతుల వద్దకు కొత్త నోట్లు రావడం లేదు. మొత్తానికి పెద్దనోట్ల రద్దు వ్యాపారుల పాలిట శాపంగా మారింది. కొత్తనోట్లు, పూర్తి స్థాయిలో చిల్లర అందుబాటులోకి వచ్చినా పడిపోయిన ఈ వ్యాపారాలన్నీ కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.



## చలి తప్ప వానేది

నవంబర్ నెల... కార్తీక మాసం... ఈశాన్య ఋతుపవనాలు ప్రవేశించి వర్షాలు కురుస్తుండాలి. కాని ఇక్కడ చూస్తే చలి తప్ప వాన చినుకు లేకుండా పోయింది. నవంబర్‌లో కూడా వర్షాలు పడకపోతే తాగు నీళ్లు, సాగునీళ్ల కోసం అగచాట్లు తప్పవు. నవంబర్‌లో కూడా వర్షాల జాడ లేక పోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## కనిపించని సండే సందడి!



పెద్ద నోట్ల ప్రభావం ప్రజల సరదాల మీద బాగానే పడింది. ఆదివారం వచ్చిందంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి ఇష్టపడతారు. చేపల, మాంసం దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. ఇక సినిమాహాళ్లలో టిక్కెట్లయితే చాలా డిమాండ్... పార్కులు, పర్యాటక ప్రాంతాలు కూడా రద్దీగా ఉంటుంటాయి. ఈ ఆదివారం జిల్లాలో అలాంటి వాతావరణం పెద్దగా కనిపించలేదు. చేపలు, మాంసం అమ్మకాలు బాగా తగ్గాయి. ఆదివారాలలో బార్లు, వైన్‌షాపులు కిటకిటలాడాలి. నిన్న ఆదివారం వైన్‌షాపుల వద్ద ఈగలు తోలుకునే పరిస్థితి ఉండగా, పెద్దగా మందుబాబులు లేక బార్లు కూడా బోసిపోయాయి. ఇంతకుముందు లాగా సినిమాలకు జనం వేలం వెర్రిగా పరుగెత్తడం లేదు. పెద్దనోట్ల రద్దు, చిల్లర నోట్ల కొరతతో ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోవడానికే ప్రథమ ప్రాధాన్యతనిస్తుండడంతో సరదాలు బంద్ అయ్యాయి.

### రవాణాశాఖ
## ఆదాయం పెరిగింది

నెల్లూరు రవాణాశాఖ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ వేలం పాట నిర్వహించారు. మొత్తం 112 వాహనాల వేలం నిర్వహించగా 100 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు వున్న 33 వాహనాలకు రూ.20.05 లక్షలు రాగా, తుక్కు ఇనుము కింద 77 వాహనాలను వేలం వేయగా రూ.8.73లక్షలు ఆదాయం లభించింది. 100 వాహనాలకు కలిపి రూ.28.78 లక్షలు ఆదాయం వచ్చింది. రవాణాశాఖ ఉపరవాణా కమిషనర్ శివరామ్‌ప్రసాద్, ఎమ్వీఐలు ఆదినారాయణ, రామకృష్ణారెడ్డి, ఏఓలు కిషోర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## టూరిజం స్పాట్‌గా చెరువు

నెల్లూరులోని స్వర్ణాల చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటున్నాడు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్. పర్యాటక అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి మంజూరు చేసిన 25కోట్లతో చెరువు ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని, స్పీడ్‌బోట్లు, మ్యూజికల్ ఫౌంటేన్‌లు, చాట్ సెంటర్లు వంటివి పెట్టి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చేలా చేస్తామంటున్నారు.

### రెండువేల నోటుతో...
## ఉపయోగం సున్నా
----- నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ -----



కూలీ నాలీ చేసుకునే ప్రజలు రెండువేల రూపాయల నోట్లను తీసుకుని చిల్లర దొరక్క ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అన్ని పనులు వదులుకుని బ్యాంకుల వద్ద పడిగాపులు కాచి, పనులకు వెళ్ల లేక పస్తులు ఉంటున్నారని, ఇది సమంజసం కాదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. 19వ తేదీ నెల్లూరులో రాజన్నభవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దు సమంజసమేనని, అయితే సామాన్యుల కష్టాలను గుర్తించడంలో కేంద్రం విఫలమైందన్నారు. నిత్యం ప్రజలకు అవసరమైన వంద నోట్లు బ్యాంకుల్లో అందుబాటులో ఉంచాలని, కనీస అవసరాలు తీరే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

### టివిఎస్ కళ్యాణసదన్..
## బాధ్యతల నుండి తప్పుకుంటున్నా!
- డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్



నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న టివిఎస్ కళ్యాణసదన్ బాధ్యతల నుండి తాను తప్పుకుంటున్నట్లు సత్రం మేనేజింగ్ ట్రస్టీ అండ్ ఛైర్మెన్ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం టివిఎస్ కళ్యాణ సదన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గణపతి సచ్చిదానందస్వామి సూచనలు మేరకు గత పదేళ్లుగా ట్రస్ట్ నిర్వహణ చేస్తున్న తాను ఇప్పుడు ఆ బాధ్యతల నుండి తప్పుకుంటున్నానన్నారు. ఇప్పటి నుంచి కళ్యాణసదన్ బాధ్యతలను ఫౌండర్ కమిటిలో సీనియర్ సభ్యుడైన డాక్టర్ పివిఆర్‌కె మూర్తికి అప్పగిస్తున్నానన్నారు. ఆయన ట్రస్ట్ ఛైర్మెన్‌గా వ్యవహరిస్తారని, అధ్యక్షుడిగా అడ్వొకేట్ ఫణిరత్నం, సభ్యులుగా వెంకట్రావు, సహజానందరావు వ్యవహరిస్తారని తెలిపారు. తన కుటుంబానికి దిశా నిర్దేశనం చేసే గణపతి సచ్చిదానందస్వామి సూచనల మేరకు ట్రస్టు వ్యవహారాల నుంచి తప్పుకుంటున్నానన్నారు. కళ్యాణసదన్ నిర్వహణపై అనువంశికంగా తాను హక్కును కలిగి వుంటానని, ఎప్పుడైనా తాను బాధ్యతలను తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, అజయ్‌కుమార్‌ను శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో ఫణిరత్నం పాల్గొన్నారు.

### జగన్ నాయకత్వంలో...
## 'హోదా' సాధిస్తాం
వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి నాయకుడు శ్రావణ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా శాఖ అధ్యక్షుడు జి.పి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ నెల 19న ఆయన నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నారా లోకేష్ నిర్వహించిన యువచైతన్య సదస్సుకు నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలను బెదిరించి విద్యార్థులను తరలించారని, ముందుగా సిద్ధంచేసిన ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు ఇవ్వడం జరిగిందని ఆయన ఆరోపించారు. ప్రత్యేకహోదాపై విద్యార్థులకు సమాధానం ఇవ్వలేని పరిస్థితిలో వున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో బాబు వస్తే జాబు వస్తుందని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలుచేయడంలో విఫలమయ్యారని, కనీసం నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కూడా ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హాజీ, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శులు బి.సత్య కృష్ణ, హరికృష్ణ, కమల్, విద్యార్థి నాయకులు నిఖిల్, చరణ్‌తేజ, ఈశ్వర్, జశ్వత్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### పెద్దాసుపత్రిలో...
## మంత్రి మొక్కుబడి నిద్ర



స్వామీ, నా కోరిక తీరితే నీ కొండ మీద నిద్ర చేస్తాను, నీ సన్నిధిలో నిద్ర చేస్తాను అని భక్తులు మొక్కుకుంటుంటారు. మన రాష్ట్ర జబ్బుల శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాత్రం ఈ నెల 20వ తేదీ రాత్రి నెల్లూరులోని సకల రోగాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పెద్దాసుపత్రిలో నిద్ర చేసారు. 21వ తేదీ నగరంలో అధికారిక కార్యక్రమాలలో పాల్గొనడం కోసం 20వ తేదీ రాత్రికే నెల్లూరుకు చేరుకున్నారు. మంత్రికి మంచి గెస్ట్‌హౌస్ పెట్టినా ఆయన మాత్రం పెద్దాసుపత్రికి వచ్చి రోగుల వార్డులో రోగులకు వాడే బెడ్‌పై పడుకున్నారు. బహుశా పెద్దాసుపత్రి బాగుపడితే వచ్చి నిద్ర చేస్తానని మొక్కుకున్నాడేమో! ఆయన నెలకోసారన్నా వచ్చి ఇక్కడ నిద్రచేస్తుంటే గాని ఈ ఆసుపత్రి బాగుపడదు.

## మార్కెట్‌లో స్వైపింగ్ మిషన్



ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని ఏసి కూరగాయల మార్కెట్‌లో భారతీయ స్టేట్‌బ్యాంకుకు చెందిన మినీ సమాచార ఏటిఎంను జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ ప్రారంభించారు. స్వైపింగ్ ద్వారా వ్యాపారులకు, వినియోగదారులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నగదు రహిత లావాదేవీలు అలవర్చుకోవాలని, దీనివల్ల అనేక ప్రయోజనాలున్నాయని చెప్పారు. నగదు రహిత లావాదేవీలతో అవినీతిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. మార్కెట్‌లో చిల్లర సమస్య తలెత్తకుండా చేసేందుకు ఈ మినీ ఏటిఎంలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసి ఛైర్మెన్ మునుకూరు రవికుమార్, మార్కెటింగ్ ఏడి ఉపేంద్రకుమార్, ఎస్‌బిఐ జిఎం నారాయణ పాల్గొన్నారు.

## దేశానికి అమ్మ... ఇందిరమ్మ
### ఘనంగా శతజయంతి ఉత్సవాలు



మాజీప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ శత జయంతి ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ ఘనంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ జరిగింది. డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య నేతృత్వంలో ముందుగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలంతా కలిసి కనకమహల్ సెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, విఆర్‌సి, మద్రాస్ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం అనే నినాదంతో దేశవ్యాప్తంగా శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా అందించిన సేవలు వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, దేవకుమార్‌రెడ్డి, పత్తి సీతారాంబాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనూరాధ, ఆసిఫ్, బాలసుధాకర్, శివాచార్య, కేశవనారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద గ్రంథాలయం

నెల్లూరు నగరం 24వ డివిజన్ పరిధిలోని కళ్యాణినగర్‌లో నిర్మించిన స్వామి వివేకానంద స్మారక గ్రంథాలయాన్ని 20వ తేదీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ఆవిష్కరించారు. స్థానికులు ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యరబోలు రాజేష్, గడ్డం విజయకుమార్, మండ్ల ఈశ్వరయ్య, మొగరాల సురేష్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

# పరుగుతో... ఆరోగ్యం మెరుగు

## ఉత్సాహంగా 5కె, 10కె రన్



ఈ నెల 20వ తేదీన విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్, కృష్ణపట్నం పోర్టు కంపెనీ, దొడ్ల డెయిరీ, అపోలో ఆసుపత్రి సహకారంతో నెల్లూరు రన్నర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె, 10కె రన్ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగింది. నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ వద్ద విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఏఎస్పీ శరత్‌బాబులు జెండా ఊపి ఈ రన్‌ను ప్రారంభించారు. పిల్లా, పెద్దా తేడా లేకుండా పెద్దసంఖ్యలో ఔత్సాహికులు ఈ రన్‌లో పాల్గొన్నారు. మొదట 10కె రన్ కస్తూరిదేవి గార్డెన్స్ నుండి మొదలై అయ్యప్పగుడి వరకు వెళ్ళి, తిరిగి కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకుంది. 5కె రన్‌లో పాల్గొన్న వాళ్లు నిప్పో సెంటర్ వద్ద మలుపుతిరిగి కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకున్నారు. 10కె రన్‌లో పురుషుల నుండి మురుగన్ విజయ్, యు.రమేష్, వి.వంశీకృష్ణ, స్త్రీల విభాగంలో సుప్రియ, షలీయ్ ఏంజల్, కోటేశ్వరమ్మలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 5కె రన్‌లో పురుషుల నుండి వి.సాయి, నాగేంద్రవిజయ్, జి.అజిత్‌లు, స్త్రీల నుండి కె.పార్వతి, ఎ.చందన, అంకాళిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బహుమతులందజేసి, వారిని అభినందించారు.

రన్నర్స్ ట్రస్ట్ ఛైర్మెన్ శిల్పారెడ్డి మొత్తం ఈవెంట్‌ను పర్యవేక్షించగా కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్, నెల్లూరు డిఎస్పీ జె.వి.రాముడు, అపోలో ఆసుపత్రి యూనిట్‌హెడ్ నవీన్, దొడ్ల డెయిరీ ప్రతినిధి బాలకృష్ణ పాల్గొన్నారు.

# ఇదేం మార్పిడి

## --కొత్తనోట్లతో మార్కెట్‌లో కమిషన్ వ్యాపారం--



*మీకు కొత్త కరెన్సీ కావాలా? లక్ష ఇస్తే డెబ్బై వేలిస్తాం... నాకు తెలిసిన బ్యాంకు మేనేజర్ దగ్గర ఇరవై లక్షలున్నాయి... ఎవరన్నా కావాలంటే చెప్పండి... ఈ రెండు వారాల నుండి మార్కెట్‌లో జరుగుతున్న, ప్రజల మధ్య తిరుగుతున్న కమీషన్ వ్యాపారమిది! కేంద్ర ప్రభుత్వం చేసిందేమిటి? ఇక్కడ జరుగుతున్నదేమిటి? అవినీతిని నిర్మూలించాలి, బ్లాక్‌మనీని అరికట్టాలన్న సంకల్పంతో చేసిన పనితోనే అవినీతికి పాల్పడడమేంటి? తిరిగి నల్లధనం కూడబెట్టడమేమిటి?*

కరెన్సీ మార్పిడి వ్యవహారంలో కేంద్రప్రభుత్వం అనుసరించిన మార్గాలు లోపభూయిష్టం కావడంతో కొత్త 2వేల నోట్లు దారి మళ్లాయని, పలు బ్యాంకు మేనేజర్లే వీటిని దారిమళ్లించి తిరిగి బ్లాక్ మార్కెట్‌లోకి పంపించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 1000, 500నోట్లను రద్దు చేసిన కేంద్రం 2000 నోటును మార్కెట్‌లోకి వదిలింది. నగదు మార్పిడి ప్రక్రియతో పాటు విత్‌డ్రాలకు కూడా రెండు వేల నోట్లు ఇవ్వాలని, నోట్ల మార్పిడికి వచ్చిన వ్యక్తుల నుండి గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఇదొక కొలబద్ధ లేకుండా పోయింది. వచ్చిన వాళ్లే మళ్లీ మళ్లీ వచ్చి క్యూలలో నిలబడి కొత్త నోట్లు పొందారు. దీంతో బ్యాంకుల ముందు ఏ మాత్రం క్యూలు తగ్గలేదు. ఒకసారి తీసుకున్నోళ్లు మరోసారి తీసుకోకూడదనే నిబంధన లేకపోవడంతో కొందరు బ్యాంకు సిబ్బంది తమ వద్దకు వచ్చిన గుర్తింపు పత్రాలనే తిరిగి జెరాక్స్‌లు తీసి వారిపేరున కొత్త నగదు ఇచ్చినట్లు నమోదు చేసి 30శాతం కమీషన్‌తో దానిని తిరిగి బ్లాక్‌మార్కెట్‌లోకి వదిలారు. దీంతో అసలు లక్ష్యమే అస్తవ్యస్థమైంది. కొత్త కరెన్సీ చేతికి రాక ప్రజలు అల్లాడుతుంటే, ప్రభుత్వమిచ్చిన కరెన్సీని బ్యాంక్ సిబ్బంది బ్లాక్‌మార్కెట్‌లో కమిషన్ పద్ధతిపై అమ్ముకున్న సంఘటనలపై ప్రజలు ఉడికిపోయారు. అయితే బ్యాంకులో కొద్దిమంది అధికారులే ఈ కక్కుర్తికి పాల్పడ్డారు. నోట్ల మార్పిడి ప్రక్రియ ముగిసాక వీటిపై విచారణ చేస్తే అలాంటి దొంగలు సులభంగా దొరుకుతారు.

# చంద్రబాబును మించిన చిన్నబాబు పర్యటన



ఈ నెల 18న నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పర్యటనకు జిల్లా తెలుగుదేశం నాయకులు పెద్దఎత్తునే ఆర్భాటం చేశారు. ప్రోటోకాల్, కాన్వాయ్ ఒక్కటే లేదుగాని మిగతాదంతా చంద్రబాబు పర్యటనకంటే ఘనంగానే వుండింది. ఇటీవల ఐఓబి ఎన్‌కౌంటర్ పర్యవసానాల నేపథ్యంలో పోలీసులు చంద్రబాబుకు చేసినంత బందోబస్తు చేశారు. లోకేష్ బందోబస్తు కోసం పక్క జిల్లాల నుండి కూడా పోలీసులను తెప్పించారు. 40మంది ఇంటలిజన్స్ సిబ్బంది కూడా నెల్లూరులో దిగారు. 17వ తేదీ అర్ధరాత్రే లోకేష్ నెల్లూరు చేరుకుని హోటల్ మినర్వా గ్రాండ్‌లో బస చేశారు. 18వ తేదీ ఉదయం జిల్లాలోని తెలుగుదేశం ముఖ్యనాయకులు హోటల్‌కు వెళ్లి లోకేష్‌ను ప్రసన్నం చేసుకున్నారు. ఆయన చూపు తమ మీద పడితే చాలు అన్నట్లు నాయకులు ఆరాటపడ్డారు. 18వ తేదీ ఉదయం యువనేతతో మినర్వా గ్రాండ్ దగ్గర నుండి మినీబైపాస్ మీదుగా తెలుగుదేశంపార్టీ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బైక్‌లు పెట్టి పెట్రోల్‌ను బాగానే తగలేసారు. పార్టీ కార్యాలయంలో లోకేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇక్కడ తెలుగుదేశం నాయకులు యువనేతను సత్కరించడానికి పోటీలు పడ్డారు. తర్వాత లోకేష్ తన గురువు మంత్రి నారాయణకు చెందిన నారాయణ వైద్యకళాశాలకు వెళ్లి అక్కడ జరిగిన యువ చైతన్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు ప్రత్యేకహోదా – ప్రయోజనాలపై వేసిన ప్రశ్నలకు లోకేష్ తడబడ్డారు. ఇక్కడే తెలుగుదేశంపార్టీ కార్యకర్తల ప్రమాదబీమా లబ్దిదారుల కుటుంబసభ్యుల ఆత్మీయసమావేశంలోనూ పాల్గొన్నారు. తర్వాత గూడూరుకు వెళ్లి జనచైతన్య యాత్రలోనూ, అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగిన బహిరంగ సభలోనూ లోకేష్ ప్రసంగించారు. లోకేష్ కంట్లో పడడం కోసం జిల్లా నాయకులు నెల్లూరు, గూడూరులలో భారీ ఎత్తున ఫ్లెక్సీ కటౌట్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా పత్రికల్లోనూ భారీగా ప్రకటనలు ఇవ్వడం విశేషం.



# కాలువల వద్ద కాపలా కాస్తా!



నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 20వ తేదీ పాతవెల్లంటి గ్రామంలో ప్రజాబాట నిర్వహించారు. 5లక్షల రూపాయల వ్యయంతో ఎం.పి మేకపాటి గ్రాంటు క్రింద దళిత పేద రైతుల సాగునీళ్ళ కోసం ఏర్పాటు చేసిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తవెల్లంటి, పాతవెల్లంటి రైతులు, దళితులు సాగునీళ్ల కోసం కాలువల పూడికతీతల సమస్యలతో, కరెంటు సమస్యలతో తాము పడుతున్న అగచాట్లను కోటంరెడ్డికి వివరించారు. దీనికి స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులకి, కరెంటు అధికారులకు ఫోన్‌చేసి సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరురూరల్ నియోజకవర్గంలో చివరి ఆయకట్టుదారుడికి కూడా నీళ్లు అందించాలని కోరామని, ఎక్కడా ఇబ్బంది లేకుండా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కాలువల్లో నీళ్లు వృధాకాకుండా స్వేచ్ఛగా నీరు పారేందుకు పూడికతీతలు వేగవంతంగా చేపట్టాలని కోరామన్నారు. రైతుల సాగునీళ్ల కోసం కాలువల వద్ద స్థానిక ఎమ్మెల్యేగా స్వయంగా పర్యవేక్షిస్తూ, తానే కాలువలకి కాపలా కాస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకి తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాదర్తి సుధాకర్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మురళీరెడ్డి, ఆదిశేషారెడ్డి, అంజయ్య, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# డా॥ అంకిరెడ్డికి సన్మానం



ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డా॥ అంకిరెడ్డి షష్టిపూర్తి సందర్భంగా మంగళవారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ వారు ఏసి స్టేడియంలో అంకిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన సభలో అధ్యక్షకార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు మాట్లాడుతూ డా॥ అంకిరెడ్డి స్టేడియంలో ప్రవేశపెట్టిన సేవా కార్యక్రమాలను తాము కూడా కొనసాగిస్తామన్నారు. డా॥ అంకిరెడ్డి మాట్లాడుతూ ఈ సన్మానం తనకు జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. కోశాధికారి పొన్నం రవిచంద్ర, నలుబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి హజరత్‌బాబు, శ్రీనివాస కుమార్, ఓబులురెడ్డి, చంద్రమౌళి, సుబ్బరాజు, మాల్యాద్రి వేణుగోపాల్‌రెడ్డి, తిరుపతినాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

# సింహపురిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స



నెల్లూరు సింహపురి హాస్పిటల్‌లో సోమవారం అరుదైన గుండె శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ సి.హెచ్.భక్తవత్సలరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరుజిల్లా జలదంకి మండలం బ్రాహ్మణక్రాకకు చెందిన శ్రీధర్(13)కు కుడివైపున గుండె ఉందని, గుండెలోని వాల్ పూడిపోయి కండ పెరిగి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం తమ ఆసుపత్రికి వచ్చాడని తెలిపారు. ఇలాంటి కేసు లక్షమందిలో ఒకటి ఉంటుందన్నారు. గుండె కుడివైపున ఉన్నందున ఆపరేషన్ కష్టంగా ఉంటుందన్నారు. అధునాతన వైద్యపరికరాలు, నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉండటంతో శస్త్ర చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు. డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## వైభవంగా చండీహోమం



చండీహోమం అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న రామాంజి తదితరులు

కోట మండలం గూడలికొండపై వెలసివున్న పర్వతవర్ధిని సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం లోకకళ్యాణార్థం పట్టాభిరామ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతవర్ధిని భీమేశ్వరస్వామి మూలవిరాట్‌లకు విశిష్ట అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో చండీహోమం, రుద్రాభిషేకం పూజలు చేశారు. వందలాది మంది వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత బ్రాహ్మణ సేవాసంఘం కో-ఆర్డినేటర్ రామాంజి, జిల్లా ప్రధానకార్యదర్శి ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వేమనరావు, పట్టాభిరామ బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు కర్రా సుందరరామయ్య, అధ్యక్షుడు రామచంద్రరావు, కోశాధికారి కుమార్, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కమిటీసభ్యులు దూబగుంట శ్రీనివాసరావు, కడివేటి రామమూర్తి, మహిళా సభ్యులు లలితమ్మ, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నుంచి బ్రాహ్మణులు వచ్చి పాల్గొన్నారు.

## బ్యాంకుల వద్ద తగ్గని రద్దీ

గత కొన్ని రోజులుగా పెద్దనోట్ల మార్పిడి కోసం ఖాతాల్లో నగదు వేసేందుకు సామాన్య ప్రజలు తిప్పలు పడుతూనే ఉన్నారు. ప్రధాన బ్యాంకుల వద్ద వరుసలో గంటల తరబడి వేచి ఉండి నగదు మార్పిడి, ఖాతాల్లో వేసేందుకు, డ్రా చేసేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులోని ప్రధాన ఎస్‌బిఐ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు, సిండికేట్ బ్యాంకు, ఐవోబి, ఇండియన్ బ్యాంకులు, పినాకిని బ్యాంకు, మాలవ్యానగర్‌లోని ఎస్‌బిఐ, ఆంధ్రాబ్యాంకు తదితర ప్రాంతాల్లో ప్రజలు వేచి ఉంటున్నారు. బ్యాంకుల్లో నగదు లేదని అనధికారికంగా ప్రకటించడంతో వినియోగదారులు వెనుదిరిగారు. మాలవ్యానగర్‌లో ఎస్‌బిఐలో పలువురు ఉద్యోగులు నగదు మార్పిడి, డ్రా చేసేందుకు సెలవులు పెట్టి మరీ వెళ్లగా అక్కడి బ్యాంకులో నగదు లేవని చెప్పడం, సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఊసురుమంటూ ప్రజలు వెనుదిరిగారు.



ఇటీవల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హెచ్.డబ్ల్యు-1 ఎలిమెంటరీ స్కూల్‌కి మైక్‌సెట్‌ను అందజేస్తున్న దాత దండు జయరామిరెడ్డి. ఈ కార్యక్రమంలో ఎన్.భాస్కర్‌రెడ్డి, జి.చంద్రశేఖర్, కె.చంద్రశేఖర్, రియాజ్‌అహ్మద్, ఎస్.కె.మస్తాన్, రామ్మోహన్, రమణయ్య, ఇందిరమ్మ, ఫయాజ్ పాల్గొన్నారు.

## విద్యార్థినులకు జనవిజ్ఞాన వేదిక దోమతెరలు



విద్యార్థినులకు దోమతెరలను పంపిణీ చేస్తున్న జేవివి నాయకులు

గూడూరు రెండో పట్టణంలోని జానకిరాంపేటలో ఉన్న ఎస్టీ బాలికల వసతి గృహంలో జనవిజ్ఞానవేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారత పెట్రోలియం టెరటరీ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థినులకు చదువు ఎంత ప్రధానమో ఆరోగ్యం అంతే ముఖ్యమని అన్నారు. చిన్నతనం నుంచి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటే జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మనపాటి రవీంద్రబాబు, నర్సరాజు, జేవీవీ నాయకులు వేగూరు రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, చెంచు నారాయణ, నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మరో కార్యక్రమం జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాయత్రి పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు విజయ కుమార్, మహిధర్, కరస్పాండెంట్ శారద పాల్గొన్నారు.

## కన్నులపండువగా మహాకుంభాభిషేకం



నర్మదేశ్వర మహాదేవ్ ప్రతిష్ట శివలింగానికి పూజలుచేస్తున్న శ్రీ స్వరూపానందగిరి స్వాములవారు, శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ నర్మదేశ్వర మహాదేవ్ శివాలయంలో ఈ నెల 19న కన్నుల పండువగా మహాకుంభాభిషేకం త్రయాహ్నిక ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి దక్షిణాన సువర్ణముఖీ నదీ తీరంలో 1950వ సంవత్సరంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం నిర్మితమైంది. ఆలయంలో నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో జరిగిన ఈ మహాకుంభాభిషేకానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రసిద్ధులైన పలువురు పీఠాధిపతులు విచ్చేసి ప్రతిష్టామహోత్సవాల్లో పాల్గొన్నారు. శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, వేదాంతాచార్య ..విద్యావారధి శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారి పర్యవేక్షణలో, శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితులు మారుతీశర్మ అవధాని ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 30 లక్షలతో నిర్మించిన ఈ ఆలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సంపూర్ణానందగిరి స్వాముల వారు మాట్లాడుతూ, చనిపోయిన తర్వాత మోక్షం ప్రాప్తిస్తుందని చాలామంది అంటుంటారని, అయితే అది వాస్తవం కాదని బతికుండగానే మోక్ష సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి అష్టలక్ష్మి పీఠాధిపతి దండి నిర్మలానందగిరి స్వామి, శ్రీనివాస మంగాపురం వశిష్టాశ్రమ పీఠాధిపతి శ్రీ స్వరూపానందగిరి స్వామీజీ, దత్తాత్రేయాశ్రమ పీఠాధిపతి శంకరానందగిరి స్వామిలతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ పోతుగుంట గురవయ్యానాయుడు, సభ్యులు ప్రమీలమ్మ, ఉమ, చంద్ర, ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్లు శాంతారాం జెవవార్, కోలా ఆనందకుమార్, వైఎస్సార్సీపి నాయకులు అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ మ్యాగీకార్ల, 'అమ్మ' ఆశ్రమ వ్యవస్థాపకురాలు భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహాకుంభాభిషేకాన్ని తిలకిస్తున్న ఆలయ ఛైర్మెన్ పోతుగుంట గురవయ్యనాయుడు దంపతులు, పాల్గొన్న భక్తులు



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న శ్రీ సంపూర్ణానందగిరిస్వామీజీ

# శ్రీకాళహస్తి న్యూస్

## శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధాన అర్చకుని కన్నుమూత



బాబు గురుకుల్

దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాళహస్తీశ్వరాలయ దీక్షాగురుకుల్, ప్రధాన అర్చకుడు ఎస్‌ఎంకె అయ్యావు గురుకుల్ (బాబూ గురుకుల్) ఈ నెల 19వ తేది రాత్రి 11.55 గంటలకు తుదిశ్వాస విడిచారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో నాలుగురోజుల క్రితం ఆయన చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆయన శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు. బాబు గురుకుల్ మృతి సమాచారం స్థానికులను, భక్తులను కలచివేసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆలయాన్ని మూసివేశారు. ఎంతోకాలం నుంచి వీరి కుటుంబీకులు ఆలయప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నారు. ఎస్‌ఎంకె పరశురామ్ గురుకుల్ పుత్రుడైన బాబు గురుకుల్ 1986వ సంవత్సరం నుంచి ఆలయానికి ప్రధాన అర్చకులుగా వున్నారు. 80 ఏళ్ళ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంతో స్వామివారికి సేవలు చేసేవారు. ఆసుపత్రిలో చేరే ముందురోజు కూడా ఆయన ఆలయానికి వచ్చి స్వామికి, అమ్మవార్లకు అభిషేకపూజలు నిర్వహించారు.

### 30ఏళ్ళుగా భగవత్‌సేవ...

ఆయన గత 30ఏళ్ళుగా స్వామి, అమ్మవార్ల పాదాల చెంతనే అత్యధికసమయం గడుపుతూ, భగవంతుని సేవలు చేస్తున్నారు. స్వామివార్లకు ఆయన అభిషేకం జరిపే విధానం, హారతులిచ్చే తీరు భక్తుల్ని ఎంతో తన్మయుల్ని చేస్తుంది. దక్షిణ భారతదేశంలోని ఏ ఆలయంలోనూ ఇలా అత్యద్భుతంగా హారతులిచ్చే అర్చకులు వుండరన్నా అతిశయోక్తేమీ కాదు. అలాంటి అర్చకులు మరణించడంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, బాబు గురుకుల్ మంచి పండితుడు, కవి, రచయిత, పబ్లిషర్ కూడా. భక్తికి పట్టాభిషేకం చేస్తూ..ఆధ్యాత్మికతరంగానికి తనవంతు సేవలందిస్తూ బాబూ గురుకుల్ పలు గ్రంథాలను ముద్రింపజేశారు. ముఖ్యంగా, మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యం, వేదవేదాంత సారం, శ్రీకాళహస్తీశ్వర సహస్ర నామావళి, అనంత శ్రీ మద్రామాయణ కథా సంగ్రహం వంటి అపూర్వమైన గ్రంథాలను తెలుగు, తమిళ భాషల్లో ప్రచురింపజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఏదేమైనా, శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పునీతమైన బాబూ గురుకుల్ మృతికి స్థానిక ప్రజలు, ప్రముఖులు, సహచరులు అందరూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# నాయకులకు చిల్లర కష్టాలు

గల్పిక

"శ్రీ శ్రీనివాసం శ్రీ వేంకటేశం శ్రీ శ్రీనివాసం శితపారిజాతం" తిరుమల కొండపై శ్రీవారి దివ్యనామస్మరణ మైకుల్లో మార్మోగుతోంది. సుప్రభాత సేవ ముగించుకుని విఐపి బ్రేక్ గ్రీవెన్స్‌కు రెడీ అయిన శ్రీవారు ఒక్కో భక్తున్ని పరిశీలిస్తున్నాడు. వచ్చిన ప్రతి భక్తుడు కూడా తన హుండీలో 500, 1000 నోట్లు వేస్తుండడాన్ని చూస్తూ... మీ భక్తి పాడుకాను, మొన్నటి దాకా వంద రూపాయల నోటు తీసి భారంగా వేసేవాళ్లు... ఇప్పుడు 500, 1000నోట్లు లెక్కలేకుండా వేస్తున్నారు, నాకు మాత్రం చిల్లర అవసరం లేదనుకుంటున్నారా... నాకూ ఖర్చులుంటాయి. మా పద్మావతికి ఏదన్నా కొన్నివ్వాలిగా... చిల్లర వేయండిరా మీకు పుణ్యం ఉంటుంది... ఈ మోడీ పెద్దనోట్లు రద్దు సెగ నాకు కూడా తగిలిందని మనసులో అనుకోసాగాడు.

★★★★★

హైదరాబాద్‌లోని హైటెక్‌రత్న చంద్రబాబు నివాసం. టీవీల్లో పెద్దనోట్ల రద్దు వార్తలను చూస్తూ చంద్రబాబు దిగులుగా కూర్చున్నాడు. పక్కన టీడీపీ నాయకులు కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, గాలి ముద్దుకృష్ణమనాయుడులు కూడా వున్నారు. అప్పుడే భువనేశ్వరీదేవి వచ్చి... ఏమండి దేవాన్ష్‌కు తినడానికి బిస్కెట్లు లేవు, బజారుకెళ్లి నాలుగు బిస్కెట్ ప్యాకెట్లు కొనుక్కురండి అని చెప్పింది. చంద్రబాబు ఆమె వైపు దీనంగా చూస్తూ... నా వద్ద జేబులో వంద రూపాయలు కూడా లేవు. జేబులో నేనెప్పుడూ డబ్బులు పెట్టుకోనని తెలుసుగా... నీ దగ్గర పోపుల డబ్బాలో ఓ వంద ఉంటే పట్టుకురా అని చెప్పాడు. ఆ మాటకు భువనేశ్వరీ దేవి... నా దగ్గరంతా వైట్ మనీనే... పోపుల డబ్బాలో బ్లాక్ మనీ ఏమీ లేదు అని చెప్పింది. దేవాన్ష్ హుండీలో ఏమన్నా చిల్లర ఉందేమో చూడు... అని చంద్రబాబు చెప్పాడు. దేవాన్ష్ పేరుతో వంద కోట్ల ఆస్తులు వ్రాసారు గాని, ఆ బుడ్డోడి హుండీలో ఎప్పుడన్నా ఒక్క రూపాయి బిళ్ల వేసారా? వంద కోట్ల కంటే ఈరోజు వంద రూపాయల అవసరమే ఎక్కువైంది. దేవాన్ష్ హుండీలో కూడా డబ్బులు లేవు, మీరేం చేస్తారో నాకు తెలియదు, బుడ్డోడికి ఆకలవుతుంది, నాలుగు బిస్కెట్ ప్యాకెట్లు తెప్పించండని ఆదేశించింది. అప్పుడు పక్కనే వున్న సోమిరెడ్డి వెంటనే తన జేబులో వున్న వంద నోటు తీసి... ఈ ఆపత్కాలంలో మిమ్మల్ని ఆదుకునే అవకాశం నాకివ్వండి, ఈ నోటు తీసుకోండి అని చేతిలో పెట్టాడు. ఇంట్లో పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో చంద్రబాబు ఆ నోటు తీసుకుని... మన పార్టీ నీతినిజాయితీలకు కేరాఫ్ అడ్రస్ వంటిది, మన పార్టీలో ఎవరి వద్దా బ్లాక్‌మనీ లేదుగా? అని ప్రశ్నించాడు. అందుకు సోమిరెడ్డి... ఉంటేగింటే మన కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దగ్గర ఉండొచ్చన్నాడు. ఆ మాటకు చంద్రబాబు ఆశ్చర్యంతో... ఆయన వద్ద బ్లాక్ మనీ ఉందని ఎలా చెప్పగలరు అని అడిగాడు. పార్టీలో అందరికంటే బ్లాక్‌గా ఉండేది ఆయనే! కాబట్టి ఆయన వద్ద వుండే మనీని బ్లాక్ మనీనే అంటారుగా అని చెప్పాడు. నీ తెలివి తెల్లారినట్లేవుంది... నల్లగా ఉండే వాళ్ల దగ్గర ఉండేది నల్లడబ్బు, తెల్లగా ఉండే వాళ్ల దగ్గర ఉండేది తెల్లడబ్బు కాదు. ఆదాయ పన్ను పరిధిలోనికి రాని డబ్బును నల్లడబ్బు అంటారు... అయినా ఆ లెక్కలు నీకు తెలియదులే, బయటకెళ్లి బిస్కెట్ ప్యాకెట్లు తెచ్చుకుందాం పదండి అంటూ లేచాడు.

★★★★★

లోటస్ పాండ్‌లోని ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఇల్లు. హాల్‌లో విజయమ్మ సోఫాలో కూర్చుని ఉండగా జగన్, భారతిలు నిలబడి ఉన్నారు. విజయమ్మ ఉండి... ఏందిరా ఈ పరిస్థితి, జీవితంలో ఎప్పుడన్నా చూసామా, ఆ తెలుగుదేశం వాళ్లేమో నోరు తెరిస్తే లక్ష కోట్లు అవినీతి అంటారు, ఇంట్లో చూస్తే పప్పులుసు చేద్దామంటే కందిపప్పు లేదు, దాంట్లోకి చింతపండు, కారం, పసుపు, ఉప్పు లేవు. స్కూల్‌కెళ్లిన పిల్లలకు క్యారేజీ పంపాలి, వాటితో పాటూ స్నాక్స్ కొనాలి. ఇంట్లో చూస్తే వంద రూపాయలు చిల్లర లేదు అని అంది. అందుకు, భారతి... ఈ పరిస్థితి వస్తుందని ఊహించామా ఏంటత్తయ్య... ఊహించివుంటే కనీసం రెండు వేలకు వందనోట్లన్నా జాగ్రత్త పరచి ఉండేదాన్ని, అప్పటికీ చిల్లర వస్తుందేమోనని చెప్పి పొద్దున సాక్షి పేపర్ కలెక్షన్ కోసం బాయ్స్‌ను పంపించాను, అందరూ వెయ్యి నోట్లే ఇచ్చారని అంది. అప్పుడు జగన్... నువ్వేమీ బాధపడకమ్మా... ఇప్పుడే ఏటిఎంకు వెళ్లి చిల్లర తీసుకొస్తాను అంటూ లేచాడు.

★★★★★

అది తెలంగాణ సీఎం కేసీఆర్ నివాసం. కేసీఆర్, కేటీఆర్‌లు అప్పుడే నిద్ర లేచి వచ్చి పేపర్‌లు చదువుతున్నారు. అమ్మా... కాఫీ అంటూ కేటీఆర్ కేకేసాడు. వాళ్లమ్మ లోపల నుండి వచ్చి... కాఫీ అని కేకలేస్తే సరిపోతుందా? ఇంట్లో కాఫీ, టీ పొడి వుందా లేదా, పాలున్నాయా లేదా అని చూసుకోవద్దా... ఇంట్లో అవేమీ లేవు. అవి తెస్తేనే మీకు కాఫీ అని చెప్పింది. నాన్న మీ దగ్గర రెండొందలు చిల్లర వుంటే ఇవ్వండి... బజారుకెళ్లి పాలు, కాఫీ పొడి తెస్తానన్నాడు కేటీఆర్. ఆ రెండొందలే వుంటే రాత్రి నేను మందులు తెచ్చుకునేవాడిని అవి లేకే ఏడుపంతా అని కేసీఆర్ సమాధానమిచ్చాడు. మార్కెట్‌లో చిల్లర దొరకడం లేదు నాన్న... వెయ్యి, 500నోట్లు ఎవరూ తీసుకోవడం లేదు, ఇంట్లో చిల్లర ఖర్చులకు డబ్బులు కూడా లేవని కేటీఆర్ అన్నాడు. నువ్వేం దిగులు పడకు బిడ్డా... మన కూలీ స్కీం వుంది కదా... అమీర్‌పేటకు పోయి కూలి పనులు చేద్దాం... వాళ్లే చిల్లర ఇస్తారు అంటూ కేసీఆర్, కేటీఆర్‌ను తీసుకుని అమీర్‌పేటకు వెళ్లాడు. అక్కడ కొన్ని షాపుల వద్ద అబ్బా, కొడుకులు కలిసి మూటలు మోసి తమకు కూలీగా షాపుకు వంద రూపాయల లెక్కన ఇమ్మన్నారు... ఆ షాపుల వాళ్లు... సార్, వంద రూపాయలిచ్చి మిమ్మల్ని చిన్నబుచ్చలేము... అందుకే షాపుకు వెయ్యి లెక్కన ఇస్తున్నామంటూ అందరూ వెయ్యి నోట్లు ఇచ్చారు. దాంతో కేసీఆర్, కేటీఆర్‌లు నోర్లు తెరిచారు.

★★★★★

ఢిల్లీలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు నివాసం. వెంకయ్యనాయుడు ఓ ఇన్‌లాండ్ లెటర్ తీసుకుని చాలా సీరియస్‌గా లెటర్ వ్రాస్తున్నాడు.

ప్రియాతి ప్రియమైన ముద్దుల కూతురు

దీపమ్మకు,

మీ తండ్రి దీవించి వ్రాయునది...

జీవితంలో ఇలాంటి రోజు ఒకటొస్తుందని, నీ సాయాన్ని అర్థించాల్సి వస్తుందని అనుకోలేదు. ఇప్పటి దాకా నా జీవితం ఎలా గడిచిపోయిందో నాకే తెలియదు. కాని నిన్న రాత్రి ఒక చపాతి తిందామని చూస్తే నా దగ్గర గాని, ఓఎస్‌డి సత్య వద్ద గాని చిల్లర డబ్బులు లేవు. మంచినీళ్లు తాగి పడుకున్నాను, జీవితంలో తొలిసారిగా డబ్బులు, అది కూడా వంద నోట్లు సంపాదించుకుని వుంటే ఎంత బాగుండుననిపించింది. కప్పు కాఫీకి కూడా నా దగ్గర చిల్లర లేదు. సాయం అనుకుంటావో, ఋణమే అనుకుంటావో... నీ ఇష్టం. ఈ లేఖ చేరిన వెంటనే నాకు 100నోట్లు ఓ పాతిక సీల్డ్ కవర్‌లో పెట్టి కొరియర్‌లో పంపించగలవు. ఈ తండ్రి నీ నుండి ఇంతకంటే ఏమీ ఆశించడు... ఉంటాను తల్లి...

ఇట్లు,

మీ ముద్దుల తండ్రి వెంకయ్య.

★★★★★

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, మనోహర్ పారికర్, రాజ్‌నాథ్‌సింగ్, సురేష్ ప్రభు, సిద్ధార్థ్‌నాథ్‌సింగ్‌లు పెద్దనోట్లు రద్దుపై టీవీ ఛానెల్స్‌లో వస్తున్న వార్తలను చూస్తున్నారు. ఒక్కో బ్యాంకు ముందు నాలుగైదు కిలోమీటర్ల పొడవున క్యూలున్నాయి. నరేంద్ర మోడీ ఆ 'క్యూ'లను చూపిస్తూ... చూసారా నా దెబ్బకు నల్లకుబేరులు డబ్బులు కట్టడానికి ఎలా 'క్యూ'లైన్లలో నిలబడ్డారో అని అన్నాడు. అందుకు రాజ్‌నాథ్ సింగ్... వాళ్లు నల్ల కుబేరులు కాదు సార్, చిల్లర నోట్లు తీసుకోవడానికి రోజుల తరబడి ఎండకు, గాలికి క్యూలలో నిల్చుని నల్లబడిన అమాయకులు అని చెప్పాడు. అవునా అంటూ... మోడీ నోరు తెరిచాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు తొలగి రాబడి పెరుగుతుంది. అవసరాలు ఏదో ఒక విధంగా నెరవేరగలవు. అయితే ఆర్థిక స్తబ్ధత ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. శుభకార్య ప్రయత్నాలలో పాల్గొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు కలిసివస్తాయి. కొత్త వసతులు సమకూర్చుకొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఖర్చులు బాగా పెరుగుతాయి. శ్రమ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. పలుకుబడి బాగుండి అనుకున్న పనులు జరిగిపోతాయి. దూరప్రయాణాలుండగలవు. కోర్టు కేసులు వాయిదా పడగలవు. సభలు సమావేశాలలో పాల్గొంటారు. ప్రముఖులతో చర్చలుండగలవు. ఉద్యోగావకాశాలు లభించగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులు ఆటంకాలు తొలగి సవ్యంగా జరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. అనుకోని అవసరాలకు కొద్దిగా ఋణం చేయవలసి రావచ్చు. కరెంటు, యంత్రాల పనులు చేసేవారు అప్రమత్తంగా ఉండాలి. కొత్త వ్యాపారాలు, శుభకార్యాలు నిర్ణయం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. శరీరానికి గాయాలు తగలవచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహం కలిగిస్తాయి. పంతాలు పట్టుదలలకు పోకుండా పనులు జరుపుకొనాలి. ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. పరిమితి విధించుకొనండి. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఏకాగ్రత ఉండాలి. బిడ్డల వివాహ ఉద్యోగ విషయాలలో శుభవార్త వింటారు. కొత్త కాంట్రాక్టులు లీజులు లభించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ ఖర్చులు సమతుల్యంగా ఉంటాయి. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది. వృత్తి పరంగా రాబడి గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. విద్యార్థులు చదువుకై శ్రమిస్తారు. కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పనులు అయినవి అనిపిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరుగుతాయి. వృత్తి జీవనంలో మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది. ఆర్థికస్థితి క్రమంగా మెరుగు అవుతుంది. అనుకున్న ప్రయాణాలు తప్పనిసరి కాగలవు. అనవసర విషయాలలో శ్రద్ధ చూపవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. షేర్లు, స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 25.11.2016 నుండి

తేది. 1.12.2016 వరకు

ఈ వారము సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో రవి శనులు, ధనుస్సులో బుధశుక్రులు, మకరంలో కుజుడు, కుంభంలో కేతువు, కన్య తుల వృశ్చిక ధను రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము**

డిసెంబర్ 1తేది గురువారము ఉదయం 7.30 నుండి 9.30 లోగా ధనుర్లగ్నమున వ్యాపార అక్షరాభ్యాసాదులు.

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | ఏకాదశి | ఉ॥ గం.8.44వ॥ |
| తేది. 26 | శని | ద్వాదశి | ఉ॥ గం.10.19వ॥ |
| తేది. 27 | ఆది | త్రయోదశి | ప॥ గం.12.15వ॥ |
| తేది. 28 | సోమ | చతుర్దశి | ప॥ గం.2.20వ॥ |
| తేది. 29 | మంగళ | అమావాస్య | సా॥ గం.4.36వ॥ |

**మార్గశీర్ష మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | బుధ | పాడ్యమి | సా॥ గం.6.34వ॥ |
| తేది. 1 | గురు | విదియ | రా॥ గం.8.18వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చుల తాకిడి పెరుగుతుంది. దూరప్రయాణాలుండటం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. కుటుంబసభ్యుల పనుల వల్ల ఇబ్బందులు పడతారు. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులందు ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి ఆదాయం సామాన్యం. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యవహారాలు ఇంట బయట సవ్యంగా పర్యవేక్షించండి. పనులు నిదానంగా ఆటంకాలతో జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. కొత్త ఆర్థిక ప్రయత్నాలు చేపట్టే అవకాశం ఉన్నది. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు జరుగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులుండినా డబ్బులు సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్య ఆదాయం ఇవ్వగలవు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు వాయిదా పడతాయి. పనులందు సామరస్యం పాటించి జరుపుకొనండి. సభలు, సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరించగలరు. కుటుంబసభ్యుల సహకారం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కార్యనిర్వహణ సామర్థ్యం బాగుండినా జరుపదలచిన పనులకు ఆటంకాలుండగలవు. అందుచే కోపం టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి పరంగా ఆర్థిక స్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. వ్యాపారాలలో ఆదాయం అభివృద్ధి సామాన్యం. ఉద్యోగులకు పని భారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం జాగ్రత్త.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికంగా పరిస్థితులు సంతృప్తికరం. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. కొత్త పరిచయాలు బలపడి, పలుకుబడి పెరుగుతుంది. ఉద్యోగులకు స్థానమార్పులు, అదనపు బాధ్యతలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు టెన్షన్‌తో జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. అనుకోని ప్రయాణాలుండటం, శుభవార్తలు వినడం జరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. శుభకార్యాలు నిర్ణయం కావడం, దూరప్రయాణాలు జరగడం, ప్రభుత్వ అనుమతులు లభించడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది.

# వెల్లువెత్తిన కవితా తరంగం

## గ్రంథాలయ వారోత్సవాల్లో అలరించిన కవిసమ్మేళనం



ప్రసంగిస్తున్న ఏజేసి రాజ్‌కుమార్, పాల్గొన్న కవులు

నెల్లూరులో కవితా తరంగం వెల్లువెత్తింది. అత్యద్భుతమైన కవితలతో పలువురు కవులు సభను అలరించారు. 49వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 18వ తేది రాత్రి గ్రంథాలయంలో జరిగిన కవిసమ్మేళనం నెల్లూరు కవుల ప్రతిభాపాటవాలను చాటింది. ప్రముఖ కవి, నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చిన్ని నారాయణరావు సారధ్యంలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో పలువురు కవులు వివిధ అంశాలను హృదయాలకు హత్తుకునేలా తమ కవితలు పఠించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఈ సభకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ఎస్ రాజకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, మన పూర్వీకులు మనకు ఎంతో మంచి సాహిత్యాన్ని అందించారన్నారు. మంచి సాహిత్యాన్ని చదువుకున్నప్పుడే విద్యార్థులకు మంచి సృజనాత్మకత అలవడుతుందని, అందువల్ల ప్రతి విద్యార్థి మంచి పుస్తకంతో స్నేహం చేయాలని అన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రావినూతల ప్రేమ్‌కిషోర్‌బాబు మాట్లాడుతూ, అక్షరం అమ్మలాంటిదన్నారు. అక్షరాలను ఆత్మీయంగా ప్రేమించి అక్షరజ్ఞానాన్ని వృద్ధిచేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామినాయుడు, నెల్లూరు నగర టిడిపి అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెన్నా పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభానంతరం జరిగిన కవి సమ్మేళనంలో నెల్లూరుకు చెందిన పలు సాహితీసంఘాల ప్రతినిధులు కూడా పాల్గొనడం విశేషం. దీంతో ఈ కవి సమ్మేళనం పలు సంఘాలకు తగు ప్రాతినిధ్యం కల్పించి ఐక్యంగా.. అపూర్వంగా నిలిచిందని కవులు, సాహిత్యాభిమానులు ఆనందించారు. ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, డాక్టర్ ఈదూరు సుధాకర్, ఏటూరు నాగేంద్రరావు, పాతూరు అన్నపూర్ణ, మోపూరు పెంచలనరసింహం, ఆలూరి శిరోమణి శర్మ, బొగ్గవరపు రాధాకృష్ణ, గుండాల నరేంద్ర బాబు, ములుగు లక్ష్మీమైథిలి, అవ్వారు శ్రీధరబాబు, మాటేటి రత్నప్రసాద్, మద్దూరు శ్రీనివాసులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితలు వినిపించారు. అనంతరం కవులు, కవయిత్రులను గ్రంథాలయసంస్థ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



కవితాగానం చేస్తున్న చిన్ని నారాయణరావు

# 'భవాని గీతాలు' ఆవిష్కరణ




ప్రముఖ రచయిత్రి సి. భవానీదేవి రచించిన 'భవాని గీతాలు' పుస్తక ఆవిష్కరణోత్సవం ఇటీవల హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగింది. అనేకమంది ప్రముఖులు, ప్రముఖ రచయితలు, రచయిత్రులు ఈ ఆవిష్కరణోత్సవంలో పాల్గొని భవానిదేవి రచనల వైశిష్ట్యాన్ని వివరించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 9వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో శాసనసభ డిప్యూటి స్పీకర్, ప్రముఖ సాహితీవేత్త మండలి బుద్ధప్రసాద్‌తో పాటు, సారస్వతవేత్తలు జె.బాపురెడ్డి, బొబ్బిలి భాస్కరరెడ్డి, మద్దాళి రఘురాం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# బాబు ఔట్!

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పోయాయి. దీంతో ప్రజలు మోడీతో పాటూ పెద్దనోట్లు రద్దుచేయమని లెటర్ వ్రాసిన చంద్రబాబును కూడా తిట్టసాగారు. పెద్దనోట్ల రద్దుపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిసాక ఎలాగూ అలవాటే కాబట్టి చంద్రబాబు ప్లేటు ఫిరాయించాడు. నా వల్లే పెద్దనోట్లు రద్దు అన్న మాటను వదిలేసి, కేంద్రంపై విమర్శలకు దిగాడు. తెలుగుదేశం నాయకులు కూడా పెద్దనోట్ల రద్దు క్రెడిట్‌ను క్లెయిమ్ చేయడం మానేసారు. కేంద్రంపై చంద్రబాబు అసహనం ప్రదర్శిస్తే, ఆయన అనుచరులు ఆరోపణలకు శ్రీకారం చుట్టారు.

కాని ఎంత తప్పించుకుందామనుకున్నా పెద్దనోట్ల రద్దు వ్యవహారంలో ఆయన పాత్ర ఉందని ప్రజలు నమ్ముతున్నారు. అమరావతి పరిసర ప్రాంతాల ప్రజలైతే ఆయనను బహిరంగంగానే ఆడిపోసుకుంటున్నట్లు తెలుస్తోంది.





## కావలి కబుర్లు

### నేరనియంత్రణలో ప్రత్యేక శైలి...

# పనితీరులో మేటి

ప్రభుత్వ ఉద్యోగులలో వృత్తిలో అంకితభావం, నిబద్ధత ఉంటాయి, అయితే వారిలో చక్కటి పనితీరు ఉండడం అరుదు. ఓ వైపు పనితీరులో మేటిగా, మరో వైపు వృత్తిలో అంకితభావం చాటుతూ... ప్రజలచేత, తమ శాఖలోని ఇతర అధికారులచేత ప్రశంసలు పొందుతున్న కావలి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యన్.వెంకట్రావు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.






మూడు దశాబ్దాల క్రితం సిఐగా పనిచేసిన నూకరాజు, 90వ దశకంలో సిఐ గా పనిచేసిన సుంకర సాయిబాబాలు నేటికీ కావలి ప్రజల మదిలో అప్పుడప్పుడూ మెదులుతుంటారు. వారి పనితీరును మించి పనిచేస్తూ ప్రస్తుతం ప్రజల చర్చల్లో నూకరాజు, సాయిబాబాల వలే పనిచేస్తూ.... అదే ధోరణి సిఐ వెంకట్రావులో ఉన్నదనే ప్రశంస పొందుతున్నాడీ అధికారి. అర్ధ రాత్రైనా అపరాత్రైనా జాతీయరహదారిపై ఎక్కడో ఒక చోట జనానికి తారసపడుతూ చాలాకాలం తరువాత బుల్లెట్ వాడుతున్న అధికారిగా ప్రస్తుతం డియస్‌పిలుగా పనిచేస్తున్న వియస్ రాంబాబు, టిపి కొండారెడ్డిలను గుర్తుకు తెస్తున్నారు. తన పనితీరుతో పోలీసు శాఖకు మంచిపేరు తెస్తూ ప్రజల దృష్టిలో తమశాఖ ప్రతిష్టను పెంచుతున్నారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నేనుంటాననే తెలుగు సినిమా శివమణి లో పోలీసు అధికారి పాత్ర వలే తన ప్రస్థానం కొనసాగిస్తున్నారు.

కావలి ఒకటవ పట్టణ సిఐగా బాద్యతలు స్వీకరించిన నాటినుండి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాఖా పరంగా మంచి పనితీరు కనపరుస్తున్నారు. గత ఆగష్టులో ఉత్తమ అధికారిగా జిల్లా మంత్రి నారాయణ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అవార్డులు, రివార్డులు ఉద్యోగులకు మామూలే! అయితే జనంలో ఒక మంచి అధికారి అని పేరు పొందడం అంత సులువుకాదు. విధి నిర్వహణ కొందరికి ఆనందం కలిగించవచ్చు, ఇంకొకరికి బాధ అనిపించవచ్చు అయితే మేలు జరిగినవారు, తమకు సహాయం అందలేదని బాధపడేవారు అందరు కూడా సిఐ వెంకట్రావు నిక్కచ్చిగా వ్యవహరించారంటారు, కరకుగా మాట్లాడినా పనితీరులో మాత్రం చట్టం దృష్టిలో అందరూ సమానులే అనే సూత్రాన్ని పాటిస్తూ ముందుకుపోతున్నారు. శిధిలావస్థలో ఉండి కళావిహీనంగా మారిన ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆధునీకరించి ట్రంకురోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు తప్పనిసరిగా సుందరంగా తీర్చిదిద్దబడిన స్టేషన్ వైపు తలతిప్పి చూడకుండా వెళ్ళలేకపోతున్నారు. దీనికికారణం సిఐ పనితీరేనని వేరే చెప్పనక్కర్లేదు. ఒకటవ పట్టణం ఆవరణంలో జిల్లా యస్‌పి విశాల్ గున్నీచే భూమిపూజ జరిపించబడ్డ సిసి కెమెరాల పర్యవేక్షణ కేంద్రం నిర్మాణ బాధ్యతను తన భుజాలపై వేసుకొని శరవేగంగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు.

ఇటువంటి మంచి అధికారిని కొద్దిరోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం వెంటనే ఆ ఉత్తర్వులు నిలుపుదల చేయటం చక చకా జరిగిపోయాయి. సిఐ బదిలీ వార్త అందరినీ ఆవేదనకు గురిచేసింది. శాఖాపరంగా నేరాలు గతంలోకంటే బాగా తగ్గించటమేకాక ప్రజలకు నేనున్నాననే భరోసా కలిగిస్తున్న అధికారి ఈయన. ఒకటవ పట్టణ పరిధిలో అవినీతి జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈరోజు ఆయన ఆక్కడ సిఐగా ఉండవచ్చు రేపు మరోచోటుకు బదిలీ కావచ్చు, అయితే కావలి పోలీస్ స్టేషన్‌ను సుందరంగా, అన్ని వసతులు సమకూరుస్తూ ఒక రోల్ మోడల్‌గా నిలపాలనే సంకల్పం తప్ప ఆందులో సిఐ వ్యక్తిగత స్వార్ధం ఏమీ లేదనేది ప్రజలందరూ అభిప్రాయ పడుతున్నారు.

ఆయన బదిలీ నిలిచిపోగానే సోషల్ మీడియాలో సమర్ధ అధికారికి ప్రజల అండదండలు ఎప్పుడూ వుంటాయని హాల్‌చల్ చేసిన ప్రచారం ఈ మొత్తం ఎపిసోడ్‌కు కొసమెరుపు.

# ప్రజల కష్టాలను తీర్చాలి

## సి.పి.ఐ. ఆధ్వర్యంలో ఆందోళన



పెద్దనోట్లు రద్దుచేసి కొత్తగా రూ.500, రూ.1000 నోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, అనేక ఆంక్షలు పెట్టి రైతులు, రైతు కూలీల బతుకులను అవస్థలపాలు చేస్తోందంటూ సి.పి.ఐ. నాయకులు, కందుకూరు సిపిఐ సెక్రెటరీ వీరారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహంచారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సి.పి.ఐ. నాయకులు డేగా సత్యనారాయణ, బాల కోటయ్య, మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సమస్యను సృష్టించి పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని వారు పేర్కొన్నారు. రూ.500, రూ. 1000 నోట్ల చెలామణి రద్దుచేయడంతో పాటు అందుకు తగ్గట్లుగా రూ.100, రూ.50, నూతన రూ.500 నోట్లను మార్కెట్‌లోకి విడుదల చేయలేదన్నారు. అదేవిధంగా వివాహ శుభకార్యాలకు ఇచ్చే నగదుకు కూడా పరిమితి విధించడం, ఆ నగదు ఇచ్చేందుకు కూడా షరతులు విధించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా జరుగనున్న సమయంలో ఈ విధమైన ఆంక్షలు రైతులకు గొడ్డలిపెట్టుగా తయారైనాయన్నారు. మార్కెట్‌లో అప్పులు దొరకక బ్యాంకుల నుండి నగదు తీసుకునే వీలులేక రైతులు చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందుగా సి.పి.ఐ. నాయకులు సి.పిఐ. కార్యాలయం నుండి ర్యాలీ బయలుదేరి నినాదాలు, ప్లకార్డులతో బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. ఆందోళన నిర్వహించిన సి.పి.ఐ. నాయకులను కావలి ఒకటో పట్టణ పోలీసులు అరెస్టుచేసి అనంతరం పూచీకత్తుపై విడుదల చేశారు.

# ఆ'పరేషాన్'

(మొదటి పేజీ తరువాయి)

నగదు లావాదేవీలు 85శాతం, నగదు రహిత లావాదేవీలు 15శాతం. నగదు లావాదేవీలలో 80శాతం వాటా వెయ్యి, 500నోట్లదే! ఒక్కసారిగా ఈ పెద్ద నోట్లను రద్దు చేస్తే తలెత్తే పరిణామాలను వ్యూహకర్తలు పసిగట్టలేకపోయారు. దీనికితోడు పెద్దనోట్లను రద్దు చేసి రెండు వేలనోటును వదిలారు. నగదు మార్పిడిలో ఆ నోటు దాచుకోవడానికి పనికొచ్చిందేగాని లావాదేవీలకు ఉపయోగపడలేదు. దీనికితోడు 2వేల నోట్లు బ్యాంకు అధికారుల ద్వారా పెద్ద మొత్తాలలో తిరిగి బ్లాక్ మార్కెట్‌లోకి పోయాయి. 2వేల నోటు బదులు 500 రూపాయల నోటు వదిలివుంటే వ్యాపారాలు ఇంతగా స్థంభించేవి కావు. ఇంత దారుణమైన పరిస్థితులు ఉత్పన్నమయ్యేవి కావు. ఎందుకంటే భారత ఆర్థిక వ్యవస్థలో నిన్నటి వరకు కూడా 500నోటే కింగ్‌గా వుండేది.

ఇక ఆర్‌బిఐ గవర్నర్‌గా రఘురామ రాజన్‌ను సాగనంపింది, ఉర్జిత్‌పటేల్‌ను పెట్టుకున్నది ఈ ఆపరేషన్ కోసమే. అయితే నైజీరియాలో పుట్టి అక్కడే పెరిగి కొన్నేళ్ల క్రితమే భారతీయ పౌరసత్వం స్వీకరించిన ఉర్జిత్‌పటేల్ భారత ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేయడంలో విఫలమయ్యాడు. పుస్తకాల్లో కనిపించే భారతానికి, ప్రాక్టికల్‌గా కనిపించే భారతానికి చాలా తేడా వుంటుంది. పెద్దనోట్ల రద్దు తర్వాత రెండు రోజుల్లేనే ఏటిఎంలను సిద్ధం చేయొచ్చని అతను ప్రధానికి గ్యారంటీ ఇచ్చాడంటేనే అర్ధమవుతుంది ఆయన అవగాహనా రాహిత్యం. సింగపూర్ వంటి దేశాలలో నోట్లు రద్దు చేస్తే పెద్దగా ప్రభావం ఉండదు. ఎందుకంటే అక్కడ జనాభా లక్షల్లో వుంటారు. అదీగాక అధిక శాతం నగదు రహిత లావాదేవీలే! 125కోట్ల జనాభా, 85శాతం నగదు లావాదేవీలున్న భారత దేశంలో 80శాతం లావాదేవీలకు ఉపయోగపడే పెద్దనోట్లను రద్దు చేస్తే ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కాదా?

**అందరికీ చెప్పే చేసుండొచ్చు...**

ఇటీవల పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం సర్జికల్ దాడులు చేసింది. ఈ దాడులు గురించి కేబినెట్‌కు గాని, మిగతా వారికి గాని ముందుగా తెలియదు. సర్జికల్ దాడులు సక్సెస్ అయ్యాయి కాబట్టి విపక్షాలతో సహా అందరూ ప్రభుత్వాన్ని అభినందించారు. బ్లాక్ మనీపై కూడా మోడీ ఇదే తరహాలో సర్జికల్ స్ట్రైక్ చేయాలనుకున్నాడు. కాని అది రివర్సయ్యింది. బ్లాక్ మనీ మీదే దాడి చేయాలనుకొన్నప్పుడు బ్లాక్‌మనీని డిపాజిట్ చేసుకునే వాళ్లకు 50రోజుల దాకా గడువివ్వడమెందుకు? 10రోజులు గడువిస్తే చాలు. దేశ జనాభానంతా కూడా తమ వద్ద వున్న నగదును తమ తమ ఖాతాల్లో 10రోజుల్లోపు డిపాజిట్లు చేసుకోమని చెప్పి వుంటే సరిపోయేది. నల్లకుబేరులకు ప్రత్యామ్నాయ దారులు వెదుక్కునే అవకాశం కూడా ఉండేది కాదు. ముందు బ్యాంకులకు వెళ్లి అకౌంట్లలో డబ్బులు వేసుండే వాళ్లు. ఒక వేళ పదిరోజుల్లోపు అకౌంట్‌లలో చేరని డబ్బు ఎలాగూ ప్రభుత్వానిదే! డబ్బు అంతా జమయ్యాక పది లక్షలు దాటితే ఇంతని, కోటి దాటితే ఇంతని నగదును బట్టి శ్లాబుల వారీగా ఆదాయపన్నును విధించి ఉంటే సరిపోయేది. ప్రజల ఇబ్బందులు కూడా పదిరోజులతో ముగిసిపోయేవి. పదిరోజుల తర్వాత కొత్త నోట్లు విత్‌డ్రా మొదలుపెట్టి ఉండొచ్చు. ప్రభుత్వం టార్గెట్ కూడా తొందరగా పూర్తయ్యేది. కాని 50రోజుల గడువు వల్ల కొద్దిపాటి నగదు వున్న చిన్న, మధ్య తరగతి ప్రజలు తమ వద్ద వున్న డబ్బును బ్యాంకుల్లో వేసేసుకున్నారు. నల్లకుబేరులు మాత్రం తమ డబ్బును కాపాడుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు.

అదీగాక ఈ ఆపరేషన్‌ను అంత సీక్రెట్‌గా చేయాల్సిన పని కూడా లేదు. రద్దు ప్రకటించే రోజు ఉదయం కేబినెట్‌లో ప్రస్తావించి ఉండొచ్చు. మధ్యాహ్నం అఖిల పక్షం సమావేశం పెట్టి అన్ని పక్షాలకు చెప్పి ఉండొచ్చు. పాక్, బంగ్లాదేశ్‌ల నుండి వస్తున్న నకిలీ కరెన్సీ, నల్లధనం అవినీతి కారణాలు చెప్పి పెద్ద నోట్లను రద్దు చేస్తున్నామని చెప్పి ఒప్పించి ఉండొచ్చు. అలా చేస్తే ఎవరూ కాదనలేరు. ఎవరూ వ్యతిరేకించలేరు. కాకపోతే కొన్ని సూచనలు ఇచ్చుండేవాళ్లు. అలా చేయడం వల్ల అప్పటికప్పుడు సబ్జెక్ట్ లీకవడం వల్ల నల్లకుబేరులు అప్పటికప్పుడు తమ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేదేమీ లేదు. అంతగా అనుమానమున్నా నల్లధనం మార్పిడికి అవకాశం ఉండేది ఒక్క రియల్ ఎస్టేట్ లేదా బంగారం కొనుగోళ్లలోనే! పెద్దనోట్ల రద్దును ప్రకటించినరోజు నుండే దేశ వ్యాప్తంగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు 10రోజుల పాటు నిలిపి వేయడం, అలాగే బంగారం కొనుగోళ్లకు పాన్‌కార్డు నిబంధనను అమలులోకి తెచ్చివుంటే సులభంగా పని జరిగిపోయేది. ప్రజలకు గాని కేంద్ర ప్రభుత్వానికి గాని ఇంత తలనొప్పి ఉండేది కాదు. ప్రతిపక్షం చేత ఇన్ని మాటలు పడాల్సిన అవసరముండేది కాదు.

పక్కా ప్లానింగ్‌తో జరపాల్సిన ఈ ఆపరేషన్‌ను మోడీ కేవలం ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల నిర్ణయాలతో జరిపాడు. భారత ఆర్థిక చిత్రంపై వారికి సరైన అవగాహన లేకుండా తీసుకున్న నిర్ణయాలతో ఈరోజు నల్లకుబేరులు కంటే ముందుగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు సమస్యల్లో పడ్డారు. బ్లాక్‌మనీ ఆపరేషన్ పరిస్థితి ఆపరేషన్ ఫెయిల్.. పేషంట్ డైడ్ అన్నట్లుగా మారింది.


# బ్లాక్ టు వైట్

(మొదటి పేజీ తరువాయి)

అసలు అడిగితే వడ్డీతో కలిపి ఇవ్వడం చేస్తుంటాడు. కొన్ని నెలల క్రితం కూడా ఆయన వందల కోట్లలో అప్పులు తీర్చాడు.

కాగా, పెద్దనోట్ల రద్దుతో ఈ వ్యాపారులందరికి బయట ఇచ్చిన అప్పులన్నీ వచ్చేసాయి. ఇదంతా కూడా లెక్కల్లో లేని డబ్బే! ఎక్కడ దాచాలో తెలియదు, లెక్కల్లో చూపలేరు. అకౌంట్‌లలో జమ చేస్తే ప్రభుత్వానికి పోయేది కొండంతగాను, మిగిలేది గోరంతగానూ కనిపించింది. ఈ సమయంలో వారికి మంత్రి నారాయణ ఆపద్బాంధవుడిలా కనిపించాడు. మీ దగ్గర ఎంత బ్లాక్ మనీ వున్నా ఫర్లేదు, తెమ్మన్నాడు. తెచ్చిందంతా తీసుకున్నాడు. ఆ బ్లాక్‌మనీతో తమ సంస్థ ఖర్చులు, జీతాలు వంటివన్నీ పూర్తి చేసాడని సమాచారం.

ఓ పక్క ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నాహజారే లెవల్లో అవినీతి, నల్లధనంపై పోరాడుతున్నానంటాడు. మరి ఆయన మంత్రివర్గ సభ్యులే అందులోనూ అత్యంత సన్నిహితుడే నల్లధన రక్షకుడిగా మారితే... ఆయన ఏం పొడుస్తున్నట్లు!





# మూగబోయిన 'మురళీ'రవం

## - తుదిశ్వాస విడిచిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ

*ప్రఖ్యాత సంగీతజ్ఞుడు, తన గానమాధుర్యంతో.. గంధర్వగానంతో అందరినీ సంగీత జలధిలో ఓలలాడించిన మహత్తర సంగీత ఝురి..మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఇక లేరు. ఆయన చెన్నైలో ఈ నెల 22న అస్తమించారు. 86ఏళ్ళ వయసులో ఆయన సంగీత ప్రపంచాన్ని వీడి.. రాగసుధారస తీరాలతో తరలివెళ్ళిపోయారు. నిద్రలోనే ఆయన నిష్క్రమించారు.*

వృద్ధాప్యంతో ఇటీవల ఆయన స్వల్ప అస్వస్థతతో వుండే వారు. సంగీతమే ఊపిరిగా జీవించి, సంగీత ప్రపంచంలో అత్యున్నత శిఖరాలకు చేరుకున్న ఆ మహోన్నత సంగీతవేత్త ఇక లేరని తెలుసుకున్న ఆయన అభిమానులు ఒక్కసారిగా శోకసాగరంలో మునిగిపోయారు. ఎంతో మంది ప్రముఖులు వచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి కంటతడిపెట్టారు.

ఎనిమిదేళ్ళ వయసులో బాలమురళీకృష్ణ సంగీత కచేరీలు చేయడం ప్రారంభించారు. 1939 నుంచి ఇప్పటిదాకా సుమారు పాతికవేలకు పైగానే సంగీత కచేరీలు చేసి అందరినీ సంగీతామృతంలో ఓలలాడించారు. 1957 జనవరి 12న 'సతీసావిత్రి' చిత్రం ద్వారా ఆయన గాయకుడిగా, సంగీతదర్శకునిగా చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. 1967లో వచ్చిన భక్తప్రహ్లాద చిత్రంలో ఆయన నారదుడి పాత్రను అత్యద్భుతంగా పోషించి అందరి గుండెల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారు. 'ఆదియు అనాదియు నీవే దేవా' అంటూ ఆయన ఆ చిత్రంలో ఆలపించిన గీతం అందరి మనసుల్లో ఇట్టే నిలచిపోయింది. సంగీతరంగానికి ఎనలేని సేవలందించిన మహత్తర సంగీతవేత్త, కర్నాటకసంగీత విద్వన్మణి బాలమురళీకృష్ణ. ఆయన కంఠ స్వరం.. ఆయనకో గొప్ప వరం. ఆయన పాటలు ప్రేక్షకజన సమ్మోహనాలు. ఆయన శృతిపక్వమైన స్వరాలు సంగీత కళామ తల్లికే వెలలేని ఆభరణాలు. అందుకే ఆయన్న ఎన్నో విశిష్టమైన, ప్రఖ్యాతమైన అవార్డులు వరించాయి. ఎంతో ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి అవార్డులతో పాటు జాతీయ స్థాయిలో ఉత్తమసంగీత దర్శకునిగా కూడా ఆయన పలు అవార్డులను అందుకున్నారు. సంగీత రంగానికే ఆయన మకుటంలేని మహారాజుగా వెలుగొందారు. పలు భాషా చిత్రాల్లో ఆయన ఆలపించిన అనేక గీతాలు శ్రోతలను పార వశ్యులను చేసేవి. అత్యద్భుతమైన తన గానామృతంతో ఆయన శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవారు. ఇప్పటికీ ఆయన పాడిన 'సలలిత రాగసుధారస సారం' (నర్తనశాల), ఏటిలోని కెరటాలు ఏరు విడిచిపోవు'(ఉయ్యాల జంపాల), 'పలుకే బంగార మాయెనా'(అందాల రాముడు), 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా'(గుప్పెడు మనసు) వంటి ఎన్నో పాటలు నేటికీ శ్రోతల హృదయాలను అలరిస్తూనే వున్నాయి.

ప్రత్యేకించి ఆయనకు నెల్లూరుతో అనుబంధం ఉండడం, నెల్లూరుకు వియ్యంకుడు కావడం విశేషం. నెల్లూరుకు చెందిన నాటక రచయిత పులిగొండ్ల రామకృష్ణయ్య కుమార్తెను కోడలిగా చేసుకుని నెల్లూరుతో వియ్యంకుడిగా ఆయన బంధుత్వాన్ని కలుపుకున్నాడు. ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఆయన నెల్లూరుకు వచ్చి తన గాత్ర మాధుర్యంతో సింహపురి సంగీతాభిమానులను ఓలలాడించారు. సంగీత సరస్వతికి సుస్వరమణిమకుటంగా భాసించిన బాలమురళీకృష్ణ తన సినీసంగీత ప్రస్థానం మరో రెండునెలల్లో షష్టిపూర్తి చేసుకోబోతున్న తరుణంలో ఆయన కన్నుమూయడం ఎంతో బాధాకరం.

ఏదేమైనా ఆయన లేని లోటు తీరనిది.. ఎవరూ తీర్చలేనిది. ఆ మహా సంగీత తరంగం.. నిద్రలోనే మృత్యువు ఒడిలోకి జారిపోయింది. పాట.. కనురెప్పల్లో నీరు నిలిచిపోయింది. అద్వితీయమైన రాగస్వరాలతో కూడిన ఆ సమ్మోహనమైన ఆ మురళీగానం మూగబోయింది. కదులుతున్న కన్నీటిమాటున..ఏ దూర సుదూర తీర సరోవరాలకావలికో...తరలి వెళ్లిపోయింది.

# కోట్ల పేరుతో నోళ్లు కొట్టారు

## - నెల్లూరులో పీసీసీ చీఫ్ రఘువీరా



పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి 22వ తేదీ నెల్లూరొచ్చారు. డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. బృందావనంలో వున్న ఆంధ్రా బ్యాంకులోకి ఆయన వెళ్లారు. డబ్బులు డ్రా చేసుకోవడానికి క్యూలలో వున్న ఖాతాదారులతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. బ్యాంకు సిబ్బందితోనూ ముచ్చటించి వారి బాధలు విన్నారు. బారకాసు సెంటర్‌లోని ఎస్‌బిఐలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తూ గుండెపోటుకు గురై మరణించిన షరీఫ్ ఇంటికి వెళ్లారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన సభలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నోట్ల రద్దు పేరుతో పేదల నోళ్లు కొట్టిందని ధ్వజమెత్తారు. నోట్ల రద్దు పేరుతో పేదలను నిలువునా ముంచేసారని, పెద్దనోట్ల రద్దు విషయం ముందే తెలిసిన బీజేపీ, తెలుగుదేశం నాయకులు తమ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని, నిరుపేద, మధ్యతరగతి ప్రజలు మాత్రం నిలువునా బలయ్యారని ఆరోపించారు. నల్లధనం వెలికి తీతకు తాము వ్యతిరేకం కాదని, కాని ఇందుకు అనుసరించిన విధానాన్నే వ్యతిరేకిస్తున్నామన్నారు. పేద ప్రజలు తాము దాచుకున్న డబ్బును తీసుకోవడానికి కూడా ఇన్ని అగచాట్లు పడాలా అని ఆయన ప్రశ్నించాడు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సోషల్ మీడియాకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్‌లను రఘువీరారెడ్డి ఆవిష్కరించారు. పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా మాజీఅధ్యక్షుడు కృష్ణయాదవ్ రఘువీరారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమాలలో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, పత్తి సీతారాంబాబు, కేశవనారాయణ తదితరులు పాల్గొన్నారు.




శ్రద్ధాంజలి

అజరామరమైన కీర్తి ప్రతిష్టల్ని
ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని
అణువణువునా నింపుకున్న
మహామనిషి సుబ్బరామన్న

కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

21వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు
శాంతి కలగాలని ప్రార్థిస్తూ..






కుటుంబ సభ్యులు
మరియు అభిమానులు

తేది: 1-12-2016, గురువారం ఉదయం 11గం॥లకు
నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీరాఘవ కళ్యాణమండపమునందు
అన్నదాన కార్యక్రమము జరుగును.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com